సాహితీ
గత వారం రోజులుగా విడుదలైన
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
వరంగల్
fb.com/vaartha Digital
Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 301 పేజీలు: 8+16 వెల: 6.50

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



# రగడ.. రగడ

### 'సర్'పై చర్చకు విపక్షాల పట్టు, ఉభయసభలు పలుమార్లు వాయిదా
### గందర గోళం మధ్య బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర ఆర్థికమంత్రి
### మణిపూర్ జిఎస్‌టి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలి రోజే ఉభయ సభల్లో రభస చోటు చేసుకుంది. ఎస్‌ఐఆర్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు పట్టుబట్టాయి. లఘు చర్చకు అవకాశమిస్తామని ప్రభుత్వం హామీఇచ్చినా ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో ఉభయ సభలు పలుమార్లు వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష

>>2

సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కాలపై
## కొత్తగా 'ఆరోగ్యభద్రత సెస్'! 7

# సంక్షోభం నుంచి సంక్షేమానికి

## పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసుకుందాం



సోమవారం మక్తల్‌లో జరిగిన ప్రజాపాలన వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

### ఏ సిఎం పాలమూరును పట్టించుకోలేదు..
### రెండేళ్లలో కొడంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతలు పూర్తి
### స్థానిక ఎన్నికల్లో అభివృద్ధి చేసే నేతలనే గెలిపించండి
### మక్తల్‌లో ప్రజాపాలన వారోత్సవాల్లో సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్1,ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ వచ్చాక పాలమూరును పట్టించుకున్న సీఎంలు లేరు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా మార్చాం. పాలమూరులో పసిడి పంటలు పండాలి. వడ్డించే వాడినే నేను ఎన్ని నిధులైనా ఇస్తా..మక్తల్ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాలమూరు జిల్లాను పట్టించుకున్న ముఖ్యమంత్రులు ఎవరూ లేరని, కానీ 2023 డిసెంబరు 7 అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వంలో పాలమూరు జిల్లా ప్రజలు ఆశీర్వదించి ఓట్లు వేసి ఉమ్మడి జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేల బలగంతో పంపిస్తే తాను తెలంగాణ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిని అయ్యానని, వచ్చే పదేళ్లలో వందేళ్ల కు సరిపడా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందాం అని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. వడ్డించే వాడినే నేను జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకోవడానికి ఎన్ని నిధులైనా ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల తొలి సభ మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు సభా వేదిక పక్కన హెలిప్యాడ్ నుంచి రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలసి నేరుగా మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి మళ్లీ సభా వేదిక వద్దకు చేరుకుని రూ.1038 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజా విజయోత్సవాల సభలో సీఎం ప్రసంగించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచిన సందర్భంగా రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని క్యాబినెట్ లో నిర్ణయం తీసుకున్న తర్వాత విజయోత్సవాల తొలి సభను వెనక బడిన మక్తల్ లో ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీహరి కోరడం.. ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని అడిగారు. అందుకే ఇక్కడి నుంచే

>>2

# కాలుష్యం కోరల్లో పడొద్దు



### హైదరాబాద్ ఢిల్లీలా మారకుండా కాలుష్య పరిశ్రమలను తరలిస్తున్నాం
### బిఆర్ఎస్ పాలనలోని ఇండస్ట్రీ భూముల కన్వర్షన్‌పై విచారణ
### ఎన్నికల కోడ్ లేని చోట అభివృద్ధి చేపడితే తప్పేంటి?
### గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,డిసెంబరు1,ప్రభాతవార్త:** భారత రాజధాని ఢిల్లీ తరహా హైదరాబాద్ కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిలాడొద్దని మా ప్రభుత్వం కాలుష్య కారక పరిశ్రమలను దూరంగా తరలించే యత్నం చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబుఅన్నారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడమే బిజెపి పనిగా పెట్టుకుందని విమర్శించారు. 2022లో బిఆర్ఎస్ ప్రభుత్వం లీజ్ లాండ్‌ను ఫ్రీ హోల్డ్ చేస్తే బిజెపి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ లో కాలుష్యం పెరిగి పాఠశాల లకు సెలవులు ఇస్తున్న పరిస్థితి వస్తోందని,ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్ కు రావొద్దనే మా ప్రయత్నమని ఆయన వివరించారు. ఢిల్లీ కాలుష్య పరిస్థితి హైదరాబాద్ లో రావాలని బిజెపి, బిఆర్ఎస్ కోరుకుంటున్నాయనీ ఆరోపించారు. హిల్ట్ పాలసీ జీవో సొంత భూముల పై కన్జర్వేషన్ ఫీజు విధించామని తెలిపారు.ప్రభుత్వ భూములను దారాదత్తం చేసిందే బిఆర్ఎస్ అని ఆయన ఎద్దేవా చేశారు. యథేచ్ఛగా టైటిల్ మార్చారని ఆరోపించారు. నిరుపయోగంగా ఉన్న పరిశ్రమల భూములను ఉపయోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామనీ బిజెపి, బిఆర్ఎస్ కలసి ఆడుతున్న నాటకం ఇది అని ఆయన తెలిపారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీ కి సంబంధించిన వంద ఎకరాల ల్యాండ్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం కన్జర్వేషన్ చేసిందని అప్పుడు బిఆర్ఎస్ కు నిబంధనలు గుర్తుకురాలేదా అని బాబు ప్రశ్నించారు.బిఆర్ఎస్ తెచ్చిన గ్రిడ్ పాలసీలో 30శాతం,ఎస్ఆర్‌వో పెడితే పరిశ్రమలు ముందుకు రాలేదని తెలిపారు. అందుకే మేము ఒక అడుగు ముందుకు వేసి ప్రయత్నం చేస్తున్నామని బిఆర్ఎస్ అలసత్వం వల్లే హైదరాబాద్ పరిసరాల్లో కాలుష్యకారక పరిశ్రమలు పెరిగాయని ఆరోపించారు. లీజ్ ల్యాండ్ లను ఫ్రీ హోల్డ్ చేసేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం జీవో తెచ్చిందని గుర్తుచేశారు.ప్రభుత్వ భూముల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.ఇండస్ట్రీల వద్ద ఉన్న భూముల గురించే పాలసీ రూపొందించామని తెలిపారు. మా ప్రభుత్వం తెచ్చిన పాలసీ పై నాచారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ మద్దతు తెలిపిందని చెప్పారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే అడ్డుకుంటరు ,కాలుష్యకారక పరిశ్రమ లు తరలిస్తామంటే అడ్డుకుంటరు. పాలసీ అమలుకు ఆపరేషన్ గైడ్ లైన్స్ విడుదల అయ్యాక అభ్యంతరాలు ఉంటె చెప్పండని అన్నారు.పాలసీ విధానం లేకుండా వందల ఎకరాల ఇండస్ట్రీ భూములను బిఆర్ఎస్ ప్రభుత్వం కన్వర్షన్ చేసిందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండస్ట్రీ భూముల కన్వర్షన్ పై విచారణ జరుపుతామని ప్రకటించారు.పాలసీ లేకుండా కన్వర్షన్ చేసారని ఆయన విమర్శించారు. ఇది కొందరికి లాభం జరిగింది. కెటిఆర్ రాహుల్ గాంధీ కే కాదు ఎవరికైనా లేఖ రాయవచ్చు ఏం కాదు అని అన్నారు.నాలుక ఉందని అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకోం అనిహెచ్చరించారు.

2 నెలల్లో ఎఐ యూనివర్సిటీ ప్రారంభం: మంత్రి శ్రీధర్‌బాబు 2



కూసుమంచిలో సిఎం కాన్వాయిని తనిఖీ చేస్తున్న పోలీసులు

# ముఖ్యమంత్రి కాన్వాయి తనిఖీ

### అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా
### పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తం
### మనోహరాబాద్ పిఎస్ పరిధిలో 5 లక్షలు స్వాధీనం

**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేసేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.కూసుమంచి మండలంలోని నాయికన్ గూడెం టోల్ ప్లాజా వద్ద సిఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ వాహనాలను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న ఆరు వాహనాలను తనిఖీ చేసిన అనంతరం పంపించారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగే ప్రజాపాలన సంబరాల్లో సిఎం పాల్గొననున్నారు. ఆయన కాన్వాయి వాహనాలు ముందుగా అక్కడికి పంపారు. తెలంగాణ ఇతర రాష్ట్రాలతో సరిహద్దు కలిగిన ప్రాంతాలలో పోలీసులు నిఘా పెంచారు. మద్యం, డబ్బులు,అనుమానస్పద వ్యక్తులను ప్రశ్నించడం సోదాచేయడం జరుగుతోంది. ఆదిలాబాద్ జిల్లా బోరజ్, కొమురంభీం జిల్లా వాంకిడి, కామారెడ్డి జిల్లా మద్దునూర్ మండలం సలాబత్‌పూర్, సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద చెక్పోస్టు ఏర్పాటు చేశారు. మాడ్గీ వద్ద హైదరాబాద్–ముంబయి 65వ నంబరు జాతీయ రహదారిపై నిరంతర నిఘా ఉంటుంది. రాష్ట్ర సరిహద్దు ప్రధాన రోడ్లలో మాత్రమే 24 గంటలూ వాహనాలు తనిఖీలు చేపడుతున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు మీదుగా ఆదిలాబాద్,కొమురంభీం, మహబూబ్‌నగర్,నల్లగొండ ,ఖమ్మం, భద్రాద్రి,భూపాలపల్లి, నిర్మల్,పెద్దపల్లి, సంగారెడ్డి జిల్లాలోకి

>>2




### ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా
# శామీర్‌పేట
### తెలంగాణలో నం-1, దేశంలో నం-7
### కేంద్ర హోంశాఖ వెల్లడి

**శామీర్‌పేట, డిసెంబరు 1, ప్రభాతవార్త:** దేశంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేట (పిఎస్) ఏడవ ర్యాంకును సాధించింది. ఇక తెలంగాణ రాష్ట్రంలోనూ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ మొదటి ర్యాంకును సాధించి ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా నిలిచింది. సోమవారం ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రిత్వశాఖ వెల్లడించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న (మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని) శామీర్‌పేట పోలీస్ స్టేషన్ కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా రాణించటం ఎంపిక కావటం,గుర్తించటం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ నుంచి 10 ఉత్తమ పోలీస్‌స్టేషన్‌లను ఎంపిక చేయటం జరుగుతుంది. ఇటీవల కేంద్ర ఎంహెచ్‌ఎబృందం ప్రతినిధిబృందం అధికారి విచ్చేసి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసుల పనితీరును, రికార్డులు, నిర్వాహణ, పరిసరాలు, ప్రాంగణం, పోలీసులసేవలు వివరాలు పూర్తి స్థాయిలో సేకరించి పరిశీలనకు పంపటంజరిగింది. దీనిలో భాగంగానే సైబరాబాద్ పోలీసకమిషనరేట్ పరిధిలోని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో గుర్తించి ఎంపిక చేయటం విశేషంగా చెప్పవచ్చు.

అయితే పోలీస్‌స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వాహణలో, బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవరించటంతో పాటు ఫిర్యాదులకు సమయానుకూలంగ పరిష్కారం చూపటం వంటి అంశాలను కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిగణలోకి తీసుకుని ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేట (పిఎస్)ను గుర్తించి ఎంపిక చేసింది. అదే విధంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, గార్డెనింగ్, ఉత్తమ సిసిటిఎన్ఎస్ పనితీరు, సిబ్బంది నైపుణ్యం వంటి అంశాలను కూడ పరిశీలనలోకి తీసుకుని శామీర్‌పేట ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా గుర్తించి ఎంపికైంది.

## డ్రామాలు వద్దు



ప్రభుత్వ విధానాలపై చర్చ జరగాలి
విపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలి
పార్లమెంట్ వెలుపల ప్రధాని మోడీ 7



5
## ప్రజాగళం వినిపించడం డ్రామానా?
ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ ఆగ్రహం



# పంచాయతీలకు డిసిసి అసంతృప్తి సెగలు?

### నేడు గాంధీభవన్‌లో రేవంత్, మీనాక్షి సమక్షంలో కొత్త, పాత డిసిసిలతో సమావేశం
### టిపిసిసి కార్యవర్గంలో వివాదపరిష్కారానికి అనుసరించే ఎత్తుగడపై అంతా ఆసక్తి

**హైదరాబాద్,డిసెంబరు 1,ప్రభాతవార్త:** తెలంగాణ పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలోని క్షేత్రస్థాయి నాయకుల్లో పండగ వాతావరణము నెలకొన్నప్పటికి ఓవైపు ప్రభుత్వవ్యతిరేకత, మరోవైపు ఇటీవల నియామకమైన డిసిసి అధ్యక్షుల పట్ల అక్కడక్కడ వెల్లు వెత్తుతున్న అసంతృప్తి అధికార కాంగ్రెస్ పార్టీ గ్రామీణ నాయకులు ఎక్కడ తమపై ప్రతికూల ప్రభావం చూపుతోందో అనే ఆందోళన వ్యక్తం అవుతోన్నది. అధిష్టానం క్షేత్రస్థాయి పరిస్థితితులకు భిన్నంగా డిసిసిలను ఎంపిక చేశారని,పార్టీ నాయకులు కార్యకర్తల మనోభావాలకు భిన్నంగా, ప్రతికూల పరిస్థితిలో కూడా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న తమకు సామాజిక న్యాయం పేరుతో అవకాశం దూరం చేశారని పలు విధాలుగా అసంతృప్తి గళం వినిపిస్తున్న వేళ మంగళవారం నాడు ఉదయం 10 గంటలకు నూతన డిసిసి అధ్యక్షులు, పూర్వ డిసిసి అధ్యక్షులు, టిపిసిసికార్యవర్గ సమావేశం గాంధీ భవన్ లో జరుగబోతున్నది. ఓ వైపు క్షేత్ర స్థాయిలో మూడు విడుతల సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ శరవేగంగా జరుగుతోన్నది. డిసెంబరు 3న చివరి దశ నామినేషన్ ఘట్టం మొదలు కాబోతున్నది. మొదటి,రెండు విడుతల సర్పంచ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్న తరుణంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసిఇంచార్జ్ మీనాక్షినటరాజన్,ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్ పాల్గొంటుడటంతో ఈ సమావేశంకు అత్యంత ప్రాధన్యత సంతరించుకొంది. స్థానిక సంస్థల ఎన్నికలు బిజెపి,బిఆర్ఎస్ పార్టీల కంటే అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అసెంబ్లీలో గత రెండు

>>2



సోమవారం సిఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టిస్ చేస్తున్న దృశ్యం

# సిఎం రేవంత్ X మెస్సీ

### ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీతో మ్యాచ్ ఆడనున్న ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్1:** ప్రజాపాలనలో భాగంగా నిత్యం అధికారులతో సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉండే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేశారు. డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో సీఎం పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో ఫుడ్‌బాల్ దిగ్గజం మెస్సీ పాల్గొననున్నారు. మెస్సీతో కలిసి సీఎం ఫుట్‌బాల్ ఆడనున్నారు. దీనిలో భాగంగా ఎంసీహెచ్‌ఆర్‌డీలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఇక ఇండియా టూర్ 2025లో భాగంగా స్టార్ ప్లేయర్ మెస్సీ హైదరాబాద్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో అడుగుపెట్టనున్న మెస్సీకి ప్రభుత్వం ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఇక ఇండియా టూర్ 2025లో డిసెంబర్ 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సీతో కలిసి సీఎం రేవంత్ పోటీ పడనున్నారు. మెస్సీ టీంతో తలపడే జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ కెప్టెన్సీ వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన ఫుట్ బాల్ ప్లేయర్లు రేవంత్ టీంలో ఆడనున్నట్లు సమాచారం. ఆర్ఆర్9 జెర్సీతోసీఎం బరిలోకి దిగనున్నారు.

>>2

## సివి ఆనంద్ వంటి ఐపిఎస్‌లకు ఐఎఎస్ పోస్టులెలా ఇచ్చారు?
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు 2





7
## మహిళాలోకానికి ఆదర్శం ఈశ్వరీబాయి
107వ జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్
మంత్రి సీతక్కకు ఈశ్వరీబాయి పురస్కారం




ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం భోపాల్‌లో జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

## సంక్షోభం నుంచి సంక్షేమానికి

>> విజయోత్సవాల సభను మొట్టమొదటగా ఇక్కడ జరుపుకోవడం జరిగింది. నాకు చాలా సంతోషంగా ఉంది. కౌన్ పూచేగా మక్తల్ అనేది కాకుండా సబ్ కుచ్ పూచేగా, సబ్ కుచ్ ఆయేగా మక్తల్ అని సీఎం వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో మన జిల్లాకు చెందిన బూర్గుల రామకృష్ణ సీఎం అయ్యారని, మళ్ళీ 75 ఏళ్ల తర్వాత మీ ఆశీర్వాదంతో పాలమూరు బిడ్డ సీఎం అయ్యారు. అప్పట్లో మన జిల్లా నుంచి మంత్రులు ఎన్నికైనా... ఆనాటి సీఎం చెప్పు చేతల్లో ఉన్నారు. కానీ పాలమూరు ప్రజలు చైతన్యవంతులై ఉమ్మడి జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేల ను గెలిపిస్తే మీ రైతు బిడ్డ సీఎం అయ్యాడు. జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నుంచి ఇపుడు సీఎం గా నిలబడ్డాడు. పాలమూరు ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. మోసం చేస్తే పాతాళానికి తొక్కుతుంది. 2009లో వలస వచ్చి ఎంపీగా పోటీ చేస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం, జిల్లా ప్రాజెక్టుల పూర్తి కోసం, లక్షలాది ఎకరాలకు నీళ్లు వస్తాయనే ఆశతో , పాలమూరు లో ఊరు లేకున్నా... పార్లమెంటులో నోరు లేకున్నా..ఆయనను జిల్లా ప్రజలు ఆశీర్వదించారు. తరువాత సీఎం అయ్యాకా జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోలేదని మాజీ సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మన బిడ్డ పెత్తనం ఉండాలని జిల్లా ప్రజలు ఆశీర్వదించి నన్ను సీఎం ను చేశారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు చేసుకుంటున్నా. 2014లో తెచ్చిన జీవో 69 ను మంజూరు చేయిస్తే గత ప్రభుత్వం తొక్కి పెట్టింది. చివరకు ఆ ప్రాజెక్టు సాధన సమితి ఏర్పాటు చేసి గొంతెత్తి నినదించింది. ఇప్పుడు తాము ఆ ప్రాజెక్టు ను ప్రారంభించు కుంటుంటే కోర్టులో కేసులు వేసి అడ్డుపడుతున్నారు. మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ లో ఎకరాకు 14 లక్షలు సరిపోవడం లేదని మంత్రి శ్రీహరి వచ్చి అడిగి ఎకరాకు 18 లక్షలు ఆశిస్తున్నారని చెబితే తాను ఎకరాకు 20 లక్షలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానని క్యాబినెట్ ఆమోదం పొందింది అని సీఎం తెలిపారు. ఇప్పుడు 96 శాతం రైతులు ఒప్పుకుని భూములు ఇస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షా 15 వేల ఎకరాలకు నికర జలాలను వాడుకునే అవకాశం ఉందని, నా జీవితంలో మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రారంభం కావడం గొప్ప సంతోషం అన్నారు. 2014 లో వచ్చిన 69 జీవోను 2024 వరకు తొక్కి వేయ బడింది అన్నారు. 2014 లో వచ్చిన 69 జీవోను 2024 వరకు తొక్కి వేయ బడింది అన్నారు. రెండేళ్ల లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయక పోతే వీపు విమానం మోత అవుతుందని దండు,గుంపులు కట్టి పనులు చేయించుకోవాలన్నారు. వడ్డించేది నేనే... ఈ ప్రాంతాన్ని పాడి పంటలతో నింపి దేశానికి ఆదర్శంగా తయారు చేయాలి. ఇరిగేషన్ ఒకటే కాదు ఎడ్యుకేషన్ కూడా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి పేదవాడి బిడ్డకు విద్యను అందించాలని ప్రతీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను మంజూరు చేసి, ఒక్కో స్కూల్ కు రూ. 200 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. 14 నియోజకవర్గాలకు ఆ స్కూల్స్ ఇచ్చాం. ఇద్దరు ఎమ్మెల్యేలు వేరే పార్టీ వారైనా వాళ్లు మన జిల్లా వాళ్లే నని, ఎవరు ఎమ్మెల్యే అయినా బేధం చూపలేదు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే అడిగిన ఐ ఐ టీ నీ ఇచ్చాం. పాలమూరు యూనివర్సిటీలో కావలసిన కోర్సులు, కాలేజీలను మంజూరు చేసుకున్నాం. ఇరిగేషన్, ఎడ్యుకేషన్ కు ప్రాధాన్యత ఇచ్చి జిల్లాను రాష్ట్రం, దేశానికి ఆదర్శంగా నిలుపుతాం. మహిళలకు ఫ్రీ బస్, నా మనవడి ఇంట్లో తినే సన్న బియ్యం మే రాష్ట్రంలో మా అక్కల పిల్లలు తినాలని అందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. పక్కన ఉన్న నారాయణ పేట మహిళలు పెట్రోలు బంకు పెట్టుకుంటామని ఇచ్చాం. మహిళలు అదానీ అంబానీ తో పోటీ పడేలా సోలార్ విద్యుత్ తయారు చేస్తున్నారు. ఇంతే కాదు పదేళ్లు అధికారంలో ఉంటే అన్ని చేసుకోవచ్చు. 35 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పంచాయతీ తెంచాము. వందేళ్ల నుంచి కానీ బీసీ కుల గణన చేశాం. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తున్నాం. మీ పాలమూరు బిడ్డ రాష్ట్రానికి పెద్దకొడుకుగా గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని నడిపిస్తున్నాడు. పాలమూరు జిల్లాకు వేల కోట్ల నిధులు ఇస్తున్నాడు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మంచి వాళ్ళను ఎన్నుకోవాలి. ఎమ్మెల్యే, మంత్రుల వద్దకు వెళ్లి అభివృద్ధి పనులు మంజూరు చేసుకునే నాయకులను సర్పంచులుగా గెలిపించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూనదన్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కాన్వయి తనిఖీ

>> ప్రవేశించే మార్గాల్లో అవసరం మేరకు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి వాహనాలు, అనుమానితులను తనిఖీ చేయనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చెకోపోస్టుల మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు నగదు, మద్యం తరలింపుపై అప్రమత్తంగా ఉండాలి. నగదు రూ.49 వేల వరకు తీసుకెళ్లొచ్చు. రూ.50 వేలకు పైబడి వెంట తీసుకెళ్తే బ్యాంకు నుంచి డబ్బు డ్రా మొదలుకొని తీసుకెళ్తున్న అవసరాలపై లెక్కలు చూపించాలి. వీటితో పాటు మద్యం అక్రమ రవాణాపై ప్రతే దృష్టి సారించనున్నారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం రేయింబవళ్లు మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, చత్తీస్గడ్, నుంచి రాష్ట్రంలోకి వచ్చే అనుమానిత వాహనాలను తనిఖీ చేస్తున్నారు.
ఎన్నికల నియమావళి అమలు చేయడానికి పోలీసులు కూడా అంతరాష్ట్ర సరిహద్దుల్లోనే కాదు ఇతర రహదారులపై నిఘా పెట్టారు. తూప్రాన్ సర్కిల్ సిఐ రంగకృష్ణ, ఎస్సై సుభాష్ గౌడ్, ఐడి పార్టీ సోమవారం మనోహరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని కాళ్లకల్ గ్రామం వద్ద బైక్ పై ప్రయాణిస్తున్న కూచారం గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేని రూ.5లక్షల నగదు దొరికింది. వాటిని స్వాధీనం చేసుకొని అనంతరం ఆ మొత్తాన్ని తూప్రాన్ ఆర్డీవోకు అప్పగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అక్రమ రవాణా, అనధికార నగదు ప్రవాహ ఉల్లంఘనలను నిరోధించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతుంటాయి. మూడు విడతలుగా జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. రెండో విడత నామినేషన్ దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. డిసెంబరు 3న మూడో విడుత నామినేషన్ల ప్రక్రియ చేపట్టనున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేసేందుకు ఎంసిసి స్టాటిస్టికల్ సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలు రంగంలోకి దిగాయి. నగదు, మద్యం అక్రమ రవాణా, పంపిణీకి అడ్డుకట్ట వేసేలా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు చేపడుతున్నాయి. ప్రభుత్వ పథకాలపై ప్రచార చిత్రాల తొలగింపు సహా ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను వీడియో కెమెరాలతో చిత్రీకరించనున్నారు.

## సివి ఆనంద్ వంటి ఐపిఎస్‌లకు ఐఎఎస్ పోస్టులెలా ఇచ్చారు?

### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్1:** తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పలువురు ఐపీఎస్ ఆఫీసర్లను ఐఏఎస్ కేడర్‌లోకి తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శిఖా గోయెల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర వంటి ఐపీఎస్ ఆఫీసర్లను ఐఏఎస్ కేడర్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారో వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26వ తేదీన విడుదల చేసిన జీవో 1342 ప్రకారం పలువురు ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించిందని వడ్ల శ్రీకాంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ జీవో చట్టవిరుద్ధమని దీనిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ న్యాయమూర్తి సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ విచారిస్తూ శిఖా గోయెల్, సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర వంటి ఐపీఎస్ అధికారులకు ఐఏఎస్ హోదా ఎందుకు కల్పించారో చెప్పాలని ప్రశ్నించింది. దీనిపై డిసెంబర్ 10వ తేదీలోపు వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేసింది.

## సిఎం రేవంత్ X మెస్సీ

>> ఫుట్‌బాల్ అంటే సీఎంకు ఎంతో ఇష్టమనే విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎంతో బిజీ ఉన్నప్పటికీ ఈ మ్యాచ్ కోసం సీఎం రేవంత్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. రెండో రోజు (సోమవారం) రాత్రి కూడ ఎంసిహెచ్‌ఆర్‌డి గ్రౌండ్‌లో ఆయన ప్రాక్టీస్ చేశారు. అయితే ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీఎం రేవంత్ ఫొటోలు అధికారికంగా విడుదల చేశారు. ఈ ఫోటోలను కాంగ్రెస్ శ్రేణులు, రేవంత్ అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

## న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు పర్మిషన్ తీసుకోవాల్సిందే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ ,డిసెంబర్1:** న్యూ ఇయర్ అంటేనే సెలబ్రేషన్స్..రాబోతున్నాయి. డిసెంబర్ 31వ తేదిన సాయంత్రం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సంబరాలు చేసుకుంటారు. రోడ్లపైకి వచ్చి నానా హంగామా చేస్తారు. డీజే సౌండ్స్ పెట్టుకుని సందడి చేస్తారు. అంతేకాకుండా, పలువురు మద్యం తాగుతూ చిందులు వేస్తారు. అయితే, అయితే, పర్మిషన్ ఉండాల్సిందే అంటున్నారు పోలీసులు.
న్యూ ఇయర్ వేడుకలకు సైబరాబాద్ కమిషనరేట్ పోలీసుల పర్మిషన్ తీసుకోవాలి. న్యూ ఇయర్ 2026 ఈవెంట్లకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అంటున్నారు. 21-12-2025 లోపు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

## వారం - వర్జ్యం

02-12-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి మ.3.53
అశ్వని రా.8.47, అనూరాధ కార్తె
వర్జ్యం : తె.5.15-6.40
దు.ఉ.8.36-9.21,
2) రా.10.30-10.46
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృషభం:** స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** ఒర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరచుకునే యత్నాలు చేస్తారు. ఉద్యోగులకు బదిలీలు. బంధువుల కలయిక.

**కర్కాటకం :** వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి. వాహన సౌఖ్యం.

**సింహం:** మీ మనస్సులోని మాటను ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడతారు. నూతన పరిచయాలు కల్గుతాయి.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సన్నిహితులకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. అనుకున్న మొండి పనులలో చలనం ఏర్పడుతుంది.

**తుల:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంబంధ బాంధవ్యాలు మెరుగు పడతాయి. విలువైన వస్తువులు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**మకరం:** పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలు ప్రోత్సాహకరంగా వుంటాయి.

**కుంభం:** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్థులకు అనుకూలంగా వుంటుంది. ధనలాభం కల్గుతుంది.

**మీనం:** మీ ఆత్మగౌరవానికి మచ్చ తేవడానికి ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఫలించవు. దూర ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రగడ.. రగడ

>> కాంగ్రెస్ నేతృత్వంలో విపక్ష సభ్యులు ఓట్ చోర్, గద్దీ చోర్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేతబూని వెల్‌లోకి దూసుకెళ్లి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. విపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. "ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది.. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదు. ప్రశ్నోత్తరాలకు విపక్షాలు సహకరించాలి" అని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. ఈ మేరకు సభను 12 గంటలకు వాయిదా వేశారు. అనంతరం 12గంటలకు సభ ప్రారంభం కాగానే, విపక్ష సభ్యులు మళ్లీ ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్యే కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, అర్జున్ రామ్ మేఘ్వాల్, పంకజ్ చౌదరి, కీర్తివర్ధన్ సఇంగ్ తమతమ మంత్రిత్వ శాఖల తరఫున పత్రాలు సమర్పించారు.
అలాగే, రసాయనాలు, ఎరువులపై స్టాండింగ్ కమిటీ రెండు నివేదికలను లోక్‌సభకు సమర్పించింది. కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెంగళూరు ఐఐఎస్‌సికు ఇద్దరు లోక్‌సభ సభ్యులను ఎన్నుకోవాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే, దివాలా మరియు దివాలా కోడ్ (సవరణ) బిల్లు, జాన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును పరిశీలించే సెలెక్ట్ కమిటీలకు గడువు పొడిగించాలని మరో తీర్మానం ప్రవేశపెట్టగా, మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఇదే సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు బిల్లులను ప్రవేశపెట్టారు. 2025 సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు, మణిపూర్‌కు చెందిన జీఎస్టీ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. హెల్త్ సెక్యూర్టీ, నేషనల్ సెక్యూర్టీ సెస్ బిల్లును కూడా మంత్రి ప్రవేశపెట్టారు. సభ్యుల గందరగోళం మధ్యే ఆయా బిల్లులు మూజువాణి ఓటుతో ఆమోదం పొందినట్లు స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా ప్రకటించారు.
మరో వైపు సిర్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. సభ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళన నేపథ్యంలో లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభమైనప్పటికి విపక్షాల ఆందోళనతో మంగళవారానికి ఉభయ సభలు వాయిదాపడ్డాయి.

**రాజ్యసభ చైర్మన్ హోదాలో రాధాకృష్ణన్**

ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రాధాకృష్ణన్ రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అభినందించారు. అదే సమయంలో మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా తర్వాత ఆయనకు వీడ్కోలు పలకలేకపోవడం పట్ల ప్రతిపక్షాల నిరాశను వ్యక్తం చేశారు. రాజ్యసభ చైర్మన్‌గా సభ నిర్వహణలో నిష్పాక్షికతను కాపాడుకోవాలని, అధికార పార్టీకి అనుకూలంగా మొగ్గు చూపడం ప్రమాదకరమని ఖర్గే హెచ్చరించారు. పార్లమెంట్ వెలుపల ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ విమర్శలపైనా ఖర్గే ప్రతిస్పందిస్తూ తాము దానికి సభలోనే స్పందిస్తామన్నారు.

**నాటకానికి తెరలేపిందే మోడీ: ఖర్గే, జైరాం రమేశ్**

దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చ జరపకుండా, ప్రధాని మరోసారి నాటకానికి తెరలేపారని ఎఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ వెలుపల ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా సనపందించారు. "గడిచిన 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిరంతరం కాలరాస్తోంది. ఇందుకు సంబంధించిన ఘటనల జాబితా చాలా పెద్దది" అని ఖర్గే ఆరోపించారు. గత వర్షాకాల సమావేశాల్లోనే దాదాపు 12 బిల్లులను హడావుడిగా ఆమోదించారని ఆయన గుర్తుచేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు, జీఎస్టీ, భారత పౌర భద్రతా నియమావళి వంటి వివాదాస్పద చట్టాలను పార్లమెంటులో బుల్డోజ్ చేశారని మండిపడ్డారు.
ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిభారం కారణంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల దొంగతనం వంటి తీవ్రమైన అంశాలపై పార్లమెంటులో చర్చించాలని తాము పట్టుబడుతున్నామన్నారు.
కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ప్రధాని మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. "ప్రధాని ఎప్పుడూ పార్లమెంటుకు హాజరుకారు, విపక్షాలతో చర్చించరు. కానీ, ప్రతి సమావేశానికి ముందు పార్లమెంట్ బయట నిలబడి దేశానికి గొప్ప సందేశాలు ఇస్తారు. సభ సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించాలని కోరతారు. ఇదంతా కపటత్వం కాదా?" అని ప్రశ్నించారు. పార్లమెంట్ సజావుగా నడవకపోతే దానికి పూర్తి బాధ్యత ప్రధాని మొండి వైఖరిదేనని స్పష్టం చేశారు. 'అందరికంటే అతిపెద్ద నాటకాలరాయుడు ప్రధానే" అంటూ జైరాం రమేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## 2 నెలల్లో ఎఐ యూనివర్సిటీ ప్రారంభం: మంత్రి శ్రీధర్‌బాబు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్1:ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల సాంకేతిక సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సాఫ్ట్ వేర్ రంగంలో పనిచేస్తున్న ఇంజనీర్లు, చదువులు పూర్తి చేస్తున్న విద్యార్థులకు దీని ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. సోమవారం నాడు ఆయన కోవాసెంట్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లు పనిచేస్తున్న కోవాసెంట్ మరో రెండేళ్లలో 3000 మంది ప్రతిభావంతులను ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. ఏఐ సాంకేతిక దూకుడుతో కోడింగ్ లో ఉన్నవారు ఇతర ప్లాట్ ఫారాల్లో పనిచేస్తున్న వారు నైపుణ్యాలను పెంచుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. వారందరికి ఏఐ యూనివర్సిటీ ద్వారా రీస్కిల్, అప్ స్కిల్స్ అందిస్తామని చెప్పారు.
ఈ సందర్భంగా కోవాసెంట్ ఛైర్మన్ సి.వి. సుబ్రమణ్యంను ప్రత్యేకంగా ప్రశంసించారు. 18 మంది ఉద్యోగులతో దశాబ్దాల క్రితం సిగ్నిటీ పేరుతో సాఫ్ట్ వేర్ కంపెనీని ప్రారంభించిన ఆయన ఇవ్వాళ వేల మంది సిబ్బందితో ప్రపంచస్థాయి సంస్థగా కోవాసెంట్ ను తీర్చిదిద్దారని శ్రీధర్ బాబు చెప్పారు. టెక్నాలజీ అంటే సిలికాన్ వ్యాలీ, ప్రపంచ ప్రొడక్షన్ సెంటర్ గా చైనాలోని షెంజెన్, క్రమశిక్షణ, సుపరిపాలన కలిగిన దేశంగా సింగపూర్ ల గురించి చెప్తారని, ఈ మూడు లక్షణాలు కలగలిసిన నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. ఇక్కడ ఉన్న అనుకూల పర్యావరణం దేశంలో మరెక్కడా లేదని పేర్కొన్నారు.

## జిహెచ్‌ఎంసి విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్1:** జిహెచ్‌ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. జిహెచ్‌ఎంసీ,మున్సిపాలిటీల చట్టాల సవరణ ఆర్డినెన్స్‌లకు ఆమోద ముద్ర వేశారు. జిహెచ్‌ఎంసీలో 27 మున్సిపాలిటీలు,కార్పొరేషన్లు విలీనం చేయాలని ఈనెల 25న జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశాలో నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో పాటు విలీనం అంశాన్ని అదే రోజు జరిగిన జిహెచ్‌ఎంసీ జనరల్ బాడీ సమావేశంలో ఆమోదించిన విషయం తెలిసిందే.
దీంతో ఆర్డినెన్స్‌లకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బోడుప్పల్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపాలిటీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లను, దమ్మాయిగూడ, నాగారం, పోచారం. ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూముకుంట, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ-జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లను, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల, ఆదిబట్ల, జల్‌పల్లి, శంషాబాద్, మణికొండ, తుక్కుగూడ, నార్సింగి మున్సిపాలిటీలను, సంగారెడ్డి జిల్ల పరిధిలోన బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయించింది.



సోమవారం జమ్మూ ధన్సాల్‌లోని 161 పదాతిదళ బెటాలియన్‌లో పాసింగ్ అవుట్ పరేడ్ దృశ్యం

## విద్యుత్ ప్లాంట్లకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారు?

### మీది ప్రజా పాలనా? ద్రోహుల పాలనా?

### సిఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్1:** సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రకటించారని, ఇప్పుడు గ్రీన్ ఎనర్జీని వదిలేసి థర్మల్‌కు ఎందుకెళ్తున్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్టీపీసీ నుంచి 800 మెగావాట్లకు యూనిట్‌కు రూ.4.12 ప్రకారం ఒప్పందం జరిగిందని, రామగుండం 800, పాల్వంచ 800, మక్తల్ 800 మెగావాట్ల ప్రతిపాదనలు పెట్టారని పేర్కొన్నారు. రామగుండం ప్లాంట్‌కు జెన్కో డీపీఆర్ ఇచ్చిందని తెలిపారు. 800 మెగావాట్లకు రూ.10,800 కోట్ల ఖర్చుతో ప్రతిపాదనలు పెట్టిందని పేర్కొన్నారు. మూడు ప్లాంట్లకు కలిపి రూ.45 వేల కోట్ల ఖర్చవుతుందని చెప్పిందన్నారు. కొత్త ప్లాంట్లలో ఉత్పత్తికి యూనిట్‌కు రూ.7.70 ఖర్చవుతుందని అన్నారు. ఎన్టీపీసీ కంటే యూనిట్‌కు రూ.3 కంటే ఎక్కువ ఖర్చవుతుందని అన్నారు. సొంత ప్లాంట్లలో ఉత్పత్తి వల్ల రోజుకు 9 కోట్లు ప్రజలపై భారం పడుతుందని వివరించారు. అంటే ఏడాదికి రూ.3800 కోట్ల అదనపు భారం పడుతుంని అన్నారు. కరెంటు కొనుగోలు కోసం 25 ఏళ్ల ఒప్పందం చేసుకుంటారని.. అలా పాతికేళ్లలో తెలంగాణ ప్రజలపై రూ.82వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు. అప్పు, మిత్తి లేకుండా కరెంటు ఇవ్వడానికి ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. అప్పు పుట్టడం లేదంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే కొత్త విద్యుత్ ప్లాంట్లు కడతామని కాంగ్రెస్ చెబుతుందని విమర్శించారు. ప్రజలపై భారం పడవద్దనే బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని తెలిపారు. మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ గత చరిత్ర చూసుకోవాలని భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు హితవు పలికారు. ఏ బొగ్గు ఉన్నదని విజయవాడ, రాయలసీమ, కృష్ణపట్నంలో విద్యుత్ ప్లాంట్లు కట్టారని ప్రశ్నించారు. బ్యాలెన్స్ చేసుకోవడానికే వేర్వేరు చోట్ల థర్మల్ ప్లాంట్లు కడతారని తెలిపారు. థర్మల్ ప్లాంట్లలో ఫ్లై యాష్ ప్రధాన సమస్యగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి, నీరు అందుబాటులో ఉండటం వల్లనే దామరచర్లలో ప్లాంట్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఫ్లైయాష్ వాడుకుంటామని సిమెంట్ ఫ్యాక్టరీలు ఒప్పందం చేసుకున్నాయని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాడు తాళం వేస్తానని మంత్రి కోమటిరెడ్డి ప్రగల్భాలు పలికారని అన్నారు. నాడు తాళం వేస్తానన్న కోమటిరెడ్డి.. నేడు కేబినెట్‌లో తాళం కొడుతున్నారని విమర్శించారు.

# పంచాయతీలకు డిసిసి అసంతృప్తి సెగలు?

>> సంవత్సరాలుగా జరిగిన ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులను వరుసగా గెలిపించు ఆధిక్యతను నిరూపించుకొంటుంది. దీనికి ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు నిదర్శనం. బిఆర్ఎస్ గడిచిన పదేళ్లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలహీన పరిచింది. బిఆర్ఎస్ అప్రతిహాతంగా గత పదేళ్ళు ఎన్నికలలో గెలుస్తు రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బలమైన నాయకులు కూడా మానసికంగా ధైర్యం కోల్పోయి పోటీ చేయడానికి వెనుకడుగు వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికి ఎన్నికల్లో ఇచ్చిన హామిలలో ఉచిత బస్సు ప్రయాణం మినహా ఇతర హామీలు ఏవి కూడా అమలు చేయకపోవడంతో కొంత ప్రతికూల పరిస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ ఎన్నికలు రాజకీపార్టీల ప్రాతిపదికన జరగకపోయినప్పటికి అధికార కాంగ్రెస్ నాయకులకు ప్రజలలో ఆదరణ లభిస్తుందా లేదా అనే ప్రశ్నకు సమాధానం చెప్పబోతున్నది. జూబ్లిహిల్స్ కంటోన్మెంట్ ఎన్నికలు పరిమితమైన ప్రజాక్షేత్రంలో ప్రత్యేక పరిస్థితిలో జరిగాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వోటు వేసిన విశాల గ్రామీణ ప్రజారాశుల మద్దతు అలాగే నిలుపుకొందా లేక తగ్గిందా పెరిగిందా అనే అంశం కూడా తేటతెల్లం అవబోతుంది. కాంగ్రెస్ పార్టీ చిహ్నం బ్యాలెట్‌పేపర్‌పై ఉండనప్పటికి పార్టీ బలపరిచే అభ్యర్థులను మెజార్టీ స్థానాల్లో గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఇన్నాళ్లు పార్టీని నమ్ముకున్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయి నాయకులకు అండగా నిలబడిన గ్రామీణ నాయకులను గెలిపించుకొని పార్టీని మరింత సంస్థాగతంగా బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంపిలు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులకు ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా స్థానిక సంస్థల ఎన్నికలలో తన ఆధిక్యతను ప్రదర్శించి సొంతపార్టీ నేతలపై ప్రతిపక్షాలపై ఆధిపత్యం చాటుకోవాలనే ఉత్సాహంతో ఉన్నారు. ఈ ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఉద్బోధిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఆఘమేఘాలపై సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాలు మినహా మిగితా జిల్లాల డిసిసి అధ్యక్షులను ప్రకటించగా అవి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఆ ప్రకటన కొన్ని జిల్లాల్లో తుఫాను సృష్టించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించనప్పటికి సంస్థాగత నిర్మాణంలో అధికార పార్టీ బిసి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ 36 మంది డిసిసిలను ప్రకటించింది. ఎఐసిసి నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలను పరిశీలకులుగా వచ్చి వారి సమక్షంలోనే బహిరంగ సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. నేతల పనితీరు, కూర్పులో సామాజిక సమీకరణాల కోణాలను మేళవించి ఈ నియామకాలు చేపట్టారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కొన్ని చోట్ల ఈ నియామకాలు స్థానిక నేతల్లో అగ్గి రాజేస్తోంది. రోడ్లు భవనాలుశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడిగా నియామకమైన కైలాశ్ నేతను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రికి లేఖరాయడంతో పార్టీలో తెలంగాణ వ్యాప్తంగా ఇన్నాళ్ళు డిసిసిల నియామకంపై పలు జిల్లాలో ఉన్న అసంతృప్తి బాహటంగా పెద్దగొంతుతో మాట్లాడటానికి ప్రేరణ ఇచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి విషయంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్రెడ్డి ధీమాతో ఉన్నప్పటికీ ఆయనకు బదులు అక్కడ సంజీవ్ ముదిరాజ్‌ను నియమించడంతో వివాదం మొదలైంది. వనపర్తి డిసిసిగా శివసేనారెడ్డి ఎంపిక చేయడంతో ఎమ్మెల్యే మేగారెడ్డి, చిన్నారెడ్డిలు అసంతృప్తిలో ఉన్నట్లు పార్టీ శ్రేణులు చర్చించుకొంటున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మాత్రం మంత్రుల అనుచరులకు లభించాయి. మహబూబాబాద్ ఎమ్మెల్యే భార్యకు ఇవ్వడంపై విమర్శలు వేస్తున్నాయి. వరంగల్ మైనార్టీ నేత ఆయూబ్‌ను నియమించడం వెనుక కూడా పెద్ద రాజకీయ వ్యూహప్రతివ్యూహాలు జరిగినా అక్కడ కూడా అసంతృప్తి శ్రేణుల్లో నెలకొంది. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాటిపల్లి నగేశ్‌రెడ్డి ఎంపికపై నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అసంతృప్తిగా ఉన్నారు, కామారెడ్డి డిసిసి ఇప్పటివరకు వరుసగా రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా ఉన్న కైలాస్ శ్రీనివాస్ రావును మరోసారి కొనసాగించేందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గట్టి ప్రయత్నం చేసినా అది సఫలం కాలేదు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ సారథిగా ఏలె మల్లికార్జున్ నియమించడానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చి సఫలీకృతులైనారు . ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమాసాగరరావు అనుచరవర్గంకు కాకుండా మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యే వినోద్ సన్నిహితుడిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక చేశారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కుమురంభీం ఆసిఫాబాద్ డిసిసిఅధ్యక్షుడిగా ఉన్న విశ్వప్రసాదరావును, సీనియర్లను పక్కనబెట్టి 2024లో పార్టీలోకి కొత్తగా చేరిన ఆత్రం సుగణకు అవకాశం ఇవ్వడంపై కూడా పార్టీ నేతలు పెదవి విరుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇక సంగారెడ్డి, రంగారెడ్డి డిసిసి పదవి కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినా ఇక్కడ స్థానిక పరిస్థితుల దృష్ట్యాఎఐసిసి ఈ రెండు జిల్లాల పార్టీ సారథులను నియమించడంతో ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తోన్నది. ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ స్థానిక సంస్థలు, డిసిసి అధ్యక్షుల నియామకం వల్ల పార్టీలో తలెత్తిన వివాదం ఏవిధంగా ఆమె పరిష్కరించి అందరిని సంతృప్తి చెందేలా ఎలా చేస్తారని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 'సర్' ఒత్తిడికి మరో బిఎల్వో ఆత్మహత్య

**లక్నో, డిసెంబరు 1:** ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'సర్' ఒత్తిడి వల్ల ఎన్నికల సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా ఒక బూత్ లెవర్ ఆఫీసర్ (బీఎల్వో)గా పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూసైడ్ చేసుకున్నాడు.



దీనికి ముందు తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలంటూ ఏడుస్తూ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భోజ్‌పూర్‌లోని బహేది గ్రామంలో దళిత వర్గానికి చెందిన 46 ఏళ్ల సర్వేష్ కుమార్ ప్రభుత్వ స్కూల్‌లో టీచర్. అక్టోబర్ 7న ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన 'సర్' పని కోసం బూత్ లెవర్ ఆఫీసర్ (బీఎల్వో)గా ఆయనను నియ మించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు, ఆధారాలకు సంబంధించిన పత్రాలు సేకరించడానికి కిందిస్థాయి ఎన్నికల అధికారి (బీఎల్వో)గా సర్వేష్ కుమార్‌కు పని అప్పగించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో ఇచ్చిన పనిని సకాలంలో పూర్తి చేయలేకపోయాడు. ఆ ఒత్తిడిలో ఆదివారం తెల్లవారు జామున తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీఎల్వో విధుల కారణంగా పని ఒత్తిడిని ఎదుర్కోలేక పోతున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. మరోవైపు ఆత్మహత్యకు ముందు సర్వేష్‌కుమార్ తన కుటుంబాన్ని ఉద్దేశించి ఒక వీడియో సందేశాన్ని రికార్డ్ చేశాడు. సర్ పనిని పూర్తి చేయడంలో విఫలమయ్యానని అందులో తెలిపాడు. 'దీదీ, మమ్మీ నన్ను క్షమించు. దయచేసి నా పిల్లలను చూసుకోండి. ఈ ఎన్నికల పనిలో నేను విఫలమయ్యాను. నేను తీసుకునే ఈ నిర్ణయానికి నేను మాత్రమే బాధ్యత వహిస్తా. ఎవరి తప్పు లేదు. నేను చాలా బాధపడ్డాను. నేను 20 రోజులుగా నిద్రపోలేకపోతున్నా. నాకు సమయం ఉంటే ఈ పని పూర్తి చేసి ఉండేవాడిని. నాకు నలుగురు చిన్న కుమార్తెలు ఉన్నారు. దయచేసి నన్ను క్షమించండి. నేను మీ ప్రపంచానికి చాలా దూరం వెళ్తున్నా' అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. తనకు జీవిం చాలని ఉన్నదని, అయితే 'సర్' పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉన్నదని సర్వే ష్ కుమార్ అందులో వాపోయాడు. ఈ వీడియో వెలుగులోకి రావడంతో ఆయన మరణానికి కారణమైన ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలని కుటుంబం డిమాండ్ చేసింది.

# దేశంలో ఎయిర్‌పోర్టుల్లో జిపిఎస్‌ల జామ్ నిజమే

### చర్యలు తీసుకున్నాం: కేంద్రమంత్రి రామ్‌మోహన్‌నాయుడు



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పలు ఎయిర్‌పోర్టుల సమీపంలో జీపీఎస్ జామ్, సంబంధిత సమస్యలు విమానాలకు ఎదురైనట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సోమవారం పార్లమెంట్‌కు ఈ విషయం వెల్లడించింది. రాజ్యసభలో ఎంపి ఎస్ నిరంజన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు పౌర విమానయాన మంత్రి రామ్‌మోహన్ నాయుడు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2023 నవంబర్‌లో జీపీఎస్ జామింగ్ లేదా స్పూఫింగ్ సంఘటనలపై రిపోర్ట్ చేయడాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తప్పనిసరి చేసిందన్నారు. ఢిల్లీతో పాటు కోల్‌కతా, అమృత్‌సర్, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల నుంచి వీటిపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. గతనెల 6న జీపీఎస్ జామ్, జీపీఎస్‌లో సాంకేతిక సమస్యల వల్ల ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో సుమారు 800కు పైగా విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. అయితే జీపీఎస్ స్పూఫింగ్ కారణమైనప్పటికీ విమాన కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు తెలిపారు. ఉపగ్రహ ఆధారిత ల్యాండింగ్ విధానాలకు ఆటంకం కలిగినప్పుడు రన్‌వే 10లో ఉన్న సాంప్రదాయ, భూ ఆధారిత నావిగేషన్ ద్వారా దీనిని అధిగమించినట్లు చెప్పారు. మరోవైపు ప్రపంచ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా సాంప్రదాయ, భూ ఆధారిత నావిగేషన్, నిఘా వ్యవస్థల ఆపరేటింగ్ నెట్‌వర్క్‌ను భారత్ కొనసాగిస్తున్నదని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్‌కు అంతరాయం కలిగినప్పుడు ఈ వ్యవస్థలు బ్యాకప్ అందిస్తాయని పేర్కొంది. జీపీఎస్‌ను జామ్ చేయడం, అడ్డుకునేందుకు ప్రయత్నించే మూలాలను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది. వైర్‌లెస్ మానిటరింగ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎంవో) సహాయాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కోరినట్లు పేర్కొంది. ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ సెక్యూరిటీ బెదిరింపులు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునే రాన్సమ్‌వేర్, మాల్వేర్‌తో సహా విమానయాన రంగం ఎదుర్కొనే విస్తృత సైబర్ సెక్యూరిటీ ముప్పులను కూడా మంత్రి రామ్ మోహన్ నాయుడు హైలైట్ చేశారు. వీటిని ఎదుర్కొనేందుకు ఐటీ నెట్‌వర్క్‌లు, మౌలిక సదుపాయాల కల్పన, అధునాతన సైబర్ భద్రతా ఏర్పాట్లను ఏఏఐ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ (ఎన్సీఐఐపీసీ), ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ అప్ గ్రేడ్‌లు జరుగుతున్నట్లు చెప్పారు. సైబర్ భద్రతా చర్యలను నిరంతరం మెరుగుపర్చడంతో పాటు ప్రపంచ విమానయాన భద్రతా వేదికలలో భారత్ పాల్గొంటున్నదని వివరించారు.

## చిన్నారిని చితక్కొట్టిన కేసులో ఆయా తొలగింపు

### పూర్తి విచారణ జరుపుతామన్న విద్యాధికారి జెమినీకుమారి

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), డిసెంబరు 1, ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ మండల పరిధి షాపూర్‌నగర్‌లో గల పూర్ణిమా విద్యానికేతన్ హై స్కూల్‌పై వేటుపడింది. పాఠశాల ఆయా పాఠశాలలో చదివే నర్సరీ విద్యార్థిపై అమానుషంగా ప్రవర్తించిన తీరుపై ప్రభుత్వం తీవ్ర పరిణామంగా తీసుకుంది. కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిని కుమారి నాయకత్వంలో సోమవారం పాఠశాలను సందర్శించి సిబ్బందిని, విద్యార్థులను విచారించారు. ఎల్‌కెజి విద్యనభ్యస్తున్న విద్యార్థిపై పాఠశాల ఆయ అమానుషంగా ప్రవర్తించిన ఘటన విదితమే. ఈ తతంగాన్ని పక్కన బిల్డింగ్‌లో నుండి చూస్తున్న ఓవ్యక్తి తనఫోన్‌లో వీడియో తీసి మీడియాకు సమాచారం అందించారు. దీనితో విషయం కాస్త బట్టబయలై సోషల్ మీడియా ద్వారా చక్కర్లు కొట్టింది. విషయంకాస్తా కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి దృష్టికి వెళ్లింది. వెంటనే సోమవారం సంఘటనపై విచారణ ప్రారంభించిన కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమినీకుమారి ,ఎంఎల్ఓ జి.రమేశ్‌లు పాటశాల సిబ్బందిని విచారించగా పాఠశాలకు చెందిన మరో ఆయా కుమారైని సాటి ఆయా దాడీ చేసి విచక్షణారహితంగా కొట్టి కాలితో తన్నిందని తేలింది. పాఠశాల ఆయా కొట్టి, కాలితో తన్నడంతో విద్యార్థికి రాత్రి తీవ్ర జ్వరం రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అసలు విషయం సోషల్‌మీడియా ద్వారా పొక్కడంతో పూర్తి వీడియోతో విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈవిషయంపై విచారణ ప్రారంభించిన పోలీసులు విద్యార్థి తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. సంఘటనను తీవ్రపరిణామంగా భావించిన మండల విద్యాధికారి పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యవైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ సోమవారం పాఠశాలను మూసివేస్తున్నట్లు మండల విద్యాధికారి జెమినీకుమారి గేట్లకు తాళంవేసి సీజ్ నోటీసును అతికించారు.

## హైదరాబాద్‌లో అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్‌సిటీ

### వెంటారా కన్జర్వేటరీపై రిలయన్స్ ఆసక్తి

### పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న గ్లోబల్ సమ్మిట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం వినోదం, పర్యాటకం రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8-9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు దేశ-విదేశాల నుండి భారీ స్పందన లభిస్తోంది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకోనున్నారు. రిలయన్స్ గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతోంది. రిలయన్స్‌కు చెందిన వెంటారా యానిమల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ .. నైట్ సఫారి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర పర్యాటక రంగం రూపురేఖలు మారనున్నాయి. ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్ బీ హోల్డింగ్స్ కంపెనీ రూ.3వేల కోట్లతో ఫ్యూచర్ సిటీలో మూడు హోటళ్లు నిర్మించేందుకు ఒప్పం దం చేసుకోనున్నారు. ఈ కీలక ఒప్పందాలపై ఈ గ్లోబల్ సదస్సులో సంతకాలు కానున్నాయి.

## పైరసీ డబ్బుతో భారీగా ఆస్తుల కొన్న ఐబొమ్మ రవి

### విదేశీ నిపుణులతో నెట్‌వర్క్ నడిపిన కేటుగాడు

### కోర్టులో మొదటి ఛార్జిషీట్ దాఖలుకు పోలీసులు రెడీ

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను పైరసీ చేసి సినీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీ సిన కేటుగాడు ఇమ్మంది రవి విషయంలో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. సినిమాలు, ఓటిటి కంటెంట్ల పైరసీకి రవి విదేశీ నిపుణు లను నియమించుకునే వాడని పోలీసులు తేల్చారు. ఇందుకోసం నెథర్లాండ్స్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, కరేబియన్ దీవులకు చెందిన నిపుణులు అద్దె ప్రా తిపదికన రవికి సహాయం చేసినట్లు తేలింది. పైరసీ సిని మాలు, ఓటిటి కంటెంట్లను మరింత క్వాలిటీగా చూపేందుకు వీరి సేవలను రవి వాడుకున్నట్లు తేలింది. దీంతో పాటు సర్వర్ల విషయంలోనూ వీరి సహాయం పొందినట్లు తేలింది. విదేశీ నిపుణుల సహాయం తీసుకునేందుకు, పోస్టుల డె వలప్ కోసం హైదరాబాద్‌కు చెందిన అఖిల్ అనే వ్యక్తి రవికి సహకరించినట్లు తేలింది. అయితే అఖిల్ పోలీసులకు ఇంకా పట్టుబడలేదు. అతని కో సం గాలిస్తున్నారు.

అతను పట్టుబడితే రవి పైరసీ వ్యవహారంలో మరిన్ని విషయాలు వెలుగు చూసే వీలుంది. మరోవైపు పైరసీ ద్వారా సంపాదించి న డబ్బులతో రవి వైజాగ్‌తో పాటు హైదరాబాద్‌లో భారీగా ఆస్తులను సంపాదించాడని తేలింది. ఈ ఆస్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వీటిని జప్తు చేసేందుకు కోర్టుకు లేఖ రాయనున్నారు. కరేబియన్ దీవుల్లోనూ రవి ఆస్తులు సంపాదించి వుంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయి తే ఆ దేశాలలో ఈ వివరాలు తెలుసుకోవడం సులభం కాదని పోలీసులు చెబుతున్నారు. రవి భారత పౌరసత్వం వదిలి కరేబియన్ దీవుల పౌరస త్వం తీసుకోవడం తెలిసిందే. తమ దేశంలో కోట్లాది రూపాయలు చెల్లించి పౌర సత్వం తీసుకున్న వారికి సంబంధించిన వివరాలను ఆ దేశాల అధి కారులు వెల్లడించరని పోలీసులు అంటున్నారు. అయితే రవిపై భారత్‌లో వున్న క్రిమినల్ కేసుల ఆధారంగా కోర్టు అనుమతితో కరేబి యన్ దీవుల కోర్టులకు లేఖ రాసి వాటి ద్వారా సమాచారం రాబట్టే వీలుందని వారంటున్నారు. భారత్‌లో నేరాలు చేసి చట్టాలకు దొరకకుండా వుండేవారు, పన్ను లు ఎగ్గొట్టే వారు ఎక్కువగా కరేబియన్ దీవుల్లో వుండడం ఇటీవల కాలంలో ఎక్కువయ్యిందని పోలీసులు చెబుతున్నారు. రవిని రెండు విడతలుగా ఎనిమిది రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించి కీలక సమాచారం సేకరించడంతో అ తనిపై మొదటి విడత ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు పోలీసులు రెడీ అవుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే మొదటి ఛార్జిషీట్ దాఖలయ్యే వీలుంది.

**భార్యతో రవికి తెగదెంపులయ్యాయి..**

ఇదిలా ఉండగా రవి తన భార్యతో తెగతెంపులు జరిగిపోయిందని పోలీసుల విచారణలో తేలింది. ముస్లిం యువతిని పెళ్లి చేసుకున్న రవి కుమార్తె పుట్టాక గొడవలు తలెత్తడంతో ఇద్దరు విడిపోయారు. ప్రస్తుతం రవి భార్య విదేశాల్లో వుంటుందని పోలీసులు తేల్చారు. రవి అరెస్టు తరువాత ఆమె ఒక్కసారి కూడా తమతో మాట్లాడలేదని, తన భర్త గురించి అడగలేదని పోలీసులు చెబుతు న్నారు. రవి అరెస్టు వెనుక అతని భార్య అందించిన సమాచారం కారణమని వస్తున్న వార్తలు అవాస్తవమని పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు రవి బెయిల్ పిటిషన్‌పై సోమవారం నాంపల్లి కో ర్టులో వాదనలు జరిగాయి. దీనిపై విచారణ వాయిదా పడింది.

## నిర్దేశిత సమయంలో నాణ్యమైన పనులు పూర్తి కావాలి

### ఆచార సంప్రదాయాలను పాటించాలి

### మేడారం అభివృద్ధి పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు,ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షి ంచాలని, ఏ మాత్రం పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వ హించారు. రాతి పనులతో పాటు రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు ఇలా ప్రతి ఒక్క అంశంపైనా ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన ముఖ్య మంత్రి పలు ప్రాంతాల్లో తీసుకోవాల్సి న జాగ్రత్తలను సూచించారు. ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, స్థపతి శివనాగిరెడ్డి సమన్వ యంతో సాగాలని సీఎం సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సం స్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని సీఎం తెలి పారు. నిర్దేశిత సమయం లోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థుల హక్కులను రక్షించాలి

### రాష్ట్ర మెడికో పేరెంట్స్ అసోసియేషన్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య విద్యార్థుల హక్కులను రక్షించాల్సి న అవసరం ఉందని.. అందుకోసం తాము పనిచేస్తామని నీట్ అండ్ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్‌కు సంబంధించి నూతన కార్యవర్గాన్ని సోమవారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర మెడికో పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా మల్లోజు సత్యన్నారాయణ చారీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బీరెల్లి కమలాకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైద్య విద్యార్థుల హక్కుల పరిరక్షణమే ధ్యేయంగా పనిచేస్తామని అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తెలిపారు. సోమవారం నాగోల్‌లోని ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా మల్లోజు సత్యనారాయణ చారి ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి కమలాకర్ రావు ఉపాధ్యక్షులుగా పొడిశెట్టి రమేష్ కుమార్, బొడ్డుపల్లి అంజయ్య, సుజాత లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంయుక్త కార్యదర్శిలుగా టీ రత్న ప్రసాద్, గునుగుంట్ల శ్రీనివాస్ గౌడ్, నాగేందర్, యాదగిరి ఎన్నిక కాగా కోశాధికారిగా రవికుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె. శ్రీధర్ రావు, ప్రచార కార్యదర్శిగా కే వెంకట్రావు కార్యదర్శిగా గడ్డం స్వప్న ఎన్నికయ్యారు.

## సర్పంచ్ బరిలోకి అంగన్‌వాడీ టీచరు

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న నీరజ అనే మహిళ సర్పంచి అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామ పంచాయతీలో సర్పంచి పదవి ఎస్సీ రిజర్వేషన్ కోటా కింద రావడంతో ఆమె పోటీకి ఉత్సాహం చూపారు. దీంతో గ్రామానికి చెందిన నీరజ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దింపేందుకు రంగం సిద్ధమైంది. ముందస్తుగా ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు గ్రామంలో బిజెపి, భారత రాష్ట్ర సమితి ఉమ్మడి అభ్యర్థిగా వసంతను పోటీలో నిలిపారు.వెల్దండ మండలంలో తొలి విడతలో భాగంగా జరుగుతున్న సర్పంచి, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికునేందుకే నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఇద్దరు సర్పంచి అభ్యర్థులతోపాటు మరో 51మంది వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కరు చొప్పున నామినేషన్‌లు వేయడంతో వారంతా ఏకగ్రింగా ఎన్నికయ్యారు. ఉప సంహారణకు ఈనెల 3వ తేదీ చివరి రోజు కావడంతో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు డబ్బు, పదవులను ఆశ చూపిస్తున్నారు. కంటోనిపల్లిలో సర్పంచి పదవికి ఇద్దరు నామినేషన్‌లు వేయడంతో అందులో ఒకరు సర్పంచి, మరొకరు ఉప సర్పంచికి అంగీకరం తెలిపినట్లు సమాచారం. రాఘయిపల్లి పంచాయతీలో సర్పంచి పదవికి వేలం పాట నిర్వహించగా ఒకరు రూ.25 లక్షల వరకు ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఇష్టంలేని ఓఅభ్యర్ది అక్కడి నుంచి తప్పించుకుపోవడంతో అతని కోసం వెతుకలాట ప్రారంభమైంది. గనుగట్టు, శంకరకొండ, పోశమ్మగడ్డ తండాల్లోని పంచాయతీల్లో సైతం సర్పంచి ఆశావాహులు ఎవరికి వారు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు

## జాతీయ క్రీడా పోటీల్లో నారాయణ విద్యార్థుల అపూర్వ ప్రతిభ!

### బంగారం, వెండి పతకాలు కైవసం




**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** సీబీఎస్ఈ జాతీయ స్కేటింగ్ చాంపియన్ షిప్, 6వ ఫెడరేషన్ కుడో కప్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 క్రీడా పోటీల్లో నారాయణ విద్యార్థులు అబ్బురపరిచారు. విశిష్ట విజయాలతో నారాయణ స్కూల్స్ కీర్తిపతాకాన్ని దశదిశలా వ్యాప్తిచేశారు. నారాయణ స్కూల్స్ కేవలం చదువుకి మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఇతర క్రీడాంశాలతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంది అనడానికి ఈ విజయాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సీబీఎస్ఈ నేషనల్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నారాయణ స్కూల్స్ మదురైకు చెందిన మాస్టర్ ఎం. తమిళినియన్ (అండర్11 విభాగంలో) 500 మీటర్ల ఇన్‌లైన్ స్కేటింగ్ విభాగం లో బంగారు పతకం సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే కుడో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఇండియా (కెఐఎఫ్ఐ అసోసియేషన్) నిర్వహించిన 6వ ఫెడరేషన్ కుడో కప్ నేషనల్ చాంపియన్ షిప్ 2025లో నారాయణ స్కూల్స్ కటక్కు చెందిన విద్యార్థులు అయుష్ కుమార్ లేంకా (అండర్ 12) బాయ్స్, 30 కిలోల విభాగంలో వెండి పతకం, సులగ్న లేంకా (అండర్15) గర్ల్స్, 54 కిలోల విభాగంలో వెండి పతకం సాధించి జాతీయ స్థాయి క్రీడా వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించి నారాయణ కుటుంబానికి గర్వకారణం అయ్యారు. ఈ సందర్భంగా నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ.. అత్యున్నత క్రీడా వేదికలపై ఘన విజయం సాధించిన విద్యార్థులను ఎంతగానో కొనియాడారు. ఈ అద్భుత విజయం నారాయణ విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, అచంచలమైన సంకల్పానికి ప్రతి రూపంగా నిలుస్తుందన్నారు. స్కేటింగ్‌లో తమిళినియన్ అద్భుతంగా స్వర్ణ పతకాన్ని కైవశం చేసుకోగా, కుడోలో ఆయుష్, సులగ్నా తమ అత్యుత్తమ ప్రతిభతో రెండు వెండి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. నారాయణలో ప్రతి విజయం విద్యార్థుల్లో ఎనలేని స్ఫూర్తిని నింపుతుందన్నారు. నారాయణ స్కూల్స్ నిరంతర గైడెన్స్, చదువుకు ఆటంకం లేని విధంగా సడలింపులు అందిస్తుందన్నారు. విద్యార్థులు వారికి ఆసక్తి గల రంగాలలో రాణించడం కోసం సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. విద్యార్థుల విజయాలను గౌరవించటానికి, నారాయణ స్కూల్స్ విద్యార్థుల ప్రయత్నాలను ప్రత్యేక ప్రశంసలతో గుర్తిస్తుందన్నారు. విద్యార్థు లకు నగదు బహుమతులతో పాటు విద్యా ప్రయాణంలో వెనుకబడిన పాఠాలను కవర్ చేయడానికి అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గురువారం రాత్రి మరో 'సూపర్‌మూన్'

### ఆకాశంలో మరో అద్భుతం

### ఎనిమిదోసారి కనువిందు చేయనున్న చంద్రుడు



గురువారం నాటి సూపర్‌మూన్‌కు సంబంధించి నాసా విడుదల చేసిన ఫొటో

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** ఈ నెల నాలుగవ తేదీన ఆకాశంలో మరో అద్భుతం కానరానుంది. మార్గశిరమాస పౌర్ణమి రోజున చం ద్రుడు సూపర్ మూన్‌గా కనువిందు చేయనున్నాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏడు సూపర్ మూన్‌లు కనువిందు చేయగా గురువారం రాత్రి సంభవించనున్నది ఎనిమిదవది, చివరి సూపర్‌మూన్ కావడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్ నెలలో సంభవించిన సూపర్ మూన్‌ను హార్వెస్ట్ మూన్ గానూ, నవంబర్‌లో కనిపించిన పౌర్ణమిని బీవర్ మూన్‌గానూ నామకరణం చేయగా గురువారం నాటి సూపర్‌మూన్‌ను కోల్డ్ సూపర్ మూన్‌గా ఖగోళ శాస్త్రవేత్తలు పేరు పెట్టారు. శీతాకాలంలో చల్లటి వాతా వరణంలో ఈ సూపర్‌మూన్ సంభవిం చనుండడంతో దీనికి కోల్డ్ సూపర్ మూన్‌గా నామకరణం చేశారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో ఈ సూపర్‌మూన్ స్పష్టంగా కనిపించ నుంది. శీతాకాలం కావడంతో పాటు ఆకాశం నిర్మలంగా వుం డడంతో హైదరాబాద్ సహ దేశంలోని అనేకచోట్ల చంద్రుడిని అందరు స్పష్టంగా చూసే వీలుంది. సూపర్‌మూన్ రోజున చంద్రుడు సాధారణం కంటే పది శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. భూమికి చంద్రుడికి మూడు లక్షల 84 వేల కిలోమీటర్ల దూరం వుండగా గురువారం నాటి సూపర్‌మూన్ రోజున ఈ దూరం మూడు లక్షల 57 వేల కిలోమీటర్ల దూరమే వుంటుంది. అంటే 27 వేల కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నమాట. ఆ రోజున సాయంత్రం 5.14 గంటలకు చంద్రోదయం అవుతుంది. రాత్రి 9.46 గంటల తరువాత చంద్రుడి వెలుతురు మరింత పెరుగుతుంది. రా త్రి 11.14 గంటలకు పూర్తిస్థాయిలో పది శాతం ఎక్కువగా వెలుతురు కానవస్తుంది. తెల్లవారుజామున మూడు గంటల వరకు ఈ అధిక వెలుతురు వుంటుంది. ఆ తరువాత సాధారణంగా మారి మరుసటి రోజు అంటే శుక్రవారం ఉదయం 6.14 గంటలకు చంద్రుడు అస్తమిస్తాడు.

**మార్గశిర మాసం.. గురువారం పౌర్ణమికి మరింత విశిష్టత**

ఇదిలా ఉండగా భారతీయ సాంప్రదాయాల్లో మాఘ మాసంలో ఆదివారం, శ్రావణమాసంలో శుక్రవారం, కార్తిక మాసంలో సోమవారం ఎంతో విశిష్టత కలిగి వున్నాయి. ఇదే మార్గశిర మాసంలో గురువారానికి అంతటి ప్రాముఖ్యత వుందని పండితులు చెబుతున్నారు. ఆ రోజున పౌర్ణమి వస్తే మ రింత ప్రాధాన్యత వుంటుందని వారంటున్నారు. మార్గశిర మాసంలో గురువారం నాడు పౌర్ణమి వస్తే ఆ రోజున శ్రీమహాలక్ష్మీకి అత్యంత పవిత్రమైన దని వారంటున్నారు. గురువారం నాటి పౌర్ణమి రోజున మహాలక్ష్మీతో పాటు ఆమె సోదరుడు అయిన చంద్రుడితో కలిపి పూజిస్తే సకల శుభాలు లభి స్తాయని పండితులు చెబుతున్నారు. పంచాంగం ప్రకారం డిసెంబరు నాలుగవ తేదీన ఉదయం 8.37 గంటలకు పౌర్ణమి గడియలు మొదలవుతాయి. మరుసటి రోజున అంటే శుక్రవారం తెల్లవారు జామున 4.43 గంటలకు ఈ తిథి ముగుస్తుంది. కాగా పౌర్ణమి రోజున ఉదయం 6.59 గం టల నుంచి మధ్యాహ్నం 2.54 గంటల వరకు రవి యోగం కూడా వుండనుంది, ఈ సమయంలో స్నానం చేసి లక్ష్మీ నారాయణులకు పూజలు చేయడం మంచిదని పండితులు చెబుతున్నారు.

## రేపు దివ్యాంగ ఉద్యోగులందరికీ ఓడీ సౌకర్యం

### ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 3న దివ్యాంగ ఉద్యోగులందరికీ అదర్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 1683ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు సోమవారం జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులనుజనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌డబ్ల్యూ) విభాగం తరపున జారీ చేశారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, ప్రభుత్వ సీనియర్ సిటిజన్స్ విభాగం ప్రభుత్వానికి నివేదించిన పరిస్థితుల దృష్ట్యా, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనేందుకు వీలుగా, ఈ నెల 3న వికలాంగులైన ఉద్యోగులందరికీ ఓడీ సౌకర్యాన్ని మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.


**Andhra Pradesh Capital Region Development Authority (APCRDA)**
Rayapudi(V), Thullur (M), Amaravati - 522237, Andhra Pradesh

**E-Procurement Tender Notice**

APCRDA invites tenders for the following works.

| S.No. | NIT Number | Name of the Work |
|---|---|---|
| 1 | 40/MAU61-USIOHB (OTH)/341/2025-HB Dt:26.11.2025 | "Comprehensive Annual Maintenance Contract for DAIKIN VRV Air Conditioners installed in Buildings: 1, 3, 4 & 5 of AP Secretariat, IGC, Velagapudi"-Estimate Cost **Rs.1,20,00,000/-** |
| 2 | 41/MAU61-USIOHB (OTH)/341/2025-HB Dt:26.11.2025 | "Comprehensive Annual Maintenance Contract for the VOLTAS VRF Air Conditioners installed in Buildings: 2 & 6 of AP Secretariat, IGC, Velagapudi"-Estimate Cost **Rs.50,00,000/-** |

The bids can be downloaded on AP e-procurement portal from **03.12.2025** to **18.12.2025** up to **14.00 Hrs**. Due date for submission of Bids **18.12.2025** up to **15.00 Hrs**, Technical bid opening **18.12.2025 @16.00Hrs**. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

**E-Procurement Short Tender Notice**

| S.No. | NIT Number | Name of the Work |
|---|---|---|
| 3 | MAU61-USIOHB (OTH)/13/2025-HB Dt:01.12.2025. | "APCRDA-Replacement of the existing street light poles with decorative poles and smart LED luminaire with independent control system along Karakatta road from Kondaveeti vaagu to honble CM Residence and then along the road leading to Seed access road (E3 road). Providing new octagonal poles in the extent portion of seed access road and replacement of existing Luminaire with smart Luminaire upto E3-N9 junction"Estimate amount: **Rs.5,32,00,000/-** |

The bid can be downloaded on AP e-procurement portal from **02.12.2025** to **09.12.2025** up to **14.00 Hrs**. Due date for submission of Bid **09.12.2025** up to **15.00 Hrs**, Technical bid opening **09.12.2025 @16.00Hrs**. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA

వార్త

మంచిగా ఉండాలనుకొని చెడును సమర్థించేకన్నా దాన్ని ఎదిరించి చెడ్డ కావడమే మేలు.

-టంగ్‌స్టన్

# ఊబకాయానికి ఉలుకెక్కువ!

దేశంలో ఊబకాయుల సంఖ్య ఆందోళన కరంగా పెరిగిపోతోంది. ఏదో కనపడిందల్లా ఆబగా తినడం వల్ల, ఆకలికి ఓర్చుకోలేకుండా పరిమిత భోజనానికి అలవాటుపడకపోవడమూ, వారి జీవన శైలి ఇందుకు కారణాలన్న విషయం తెలిసిందే. ఈమధ్యనే ప్రధాని నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఉబకాయంపై ప్రస్తావించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, 2022లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 250 కోట్ల మంది అధిక బరువుతో బాధ పడుతున్నారు. భారతదేశంలో కూడా ఎనిమిది మందిలో ఒకరు అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి, 10 శాతం నూనె వాడకాన్ని తగ్గించాలని ప్రధాని సందేశం చర్చనీయాంశంగా మారింది. ఊబకాయ వ్యతిరేకోద్యమాన్ని ఆయనే సూచించారు. ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, ప్రధాని మోదీ 10 మంది ప్రముఖులను నామినేట్ చేసి వారు మరో 10 మందిని సూచిస్తే మంచిదని సూచించారు. ఈవిధంగా ప్రతి పదిమంది మరో పది మందిని, అలానే వారు మరో పది మందిని, నామినేట్ చేస్తూ ఊబకాయం ఎంత అనర్థమో అవగాహన కల్పించే ఉద్యమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా ఒక్క అడుగు ముందుకు కదిలిన దాఖలాలు లేవు. అధిక క్యాలరీలతో కూడిన ప్రాసెస్ చేయబడిన ఆహారం, చాక్లెట్, ఫాస్ట్‌ఫుడ్ తదితరాలు ఊబకాయానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. మానవ శరీరాన్ని సరైన పద్ధతిలో క్రియాశీలకంగా ఉంచుకోలేకపోవడమూ ఇందుకు కారణమే! బ్లూటూత్, ఇంటర్నెట్, కంప్యూటర్లు, టీవీలను తదేక దీక్షగా,క్షణం విరామం ఇవ్వకుండా నిరంతరం వినియోగిస్తుండడం వలన పరిస్థితి శారీరక శ్రమను తగ్గిస్తుంది.మూలకశక్తిని తక్కువగా శరీర బరువునుపెంచుతుంది. అలా వచ్చిన ఒళ్ళును తగ్గించుకోవాలన్నా కఠోర శ్రమ, పరిమిత ఆహారం, నియమానుసారం ఆహార స్వీకరణ చాలాముఖ్యం. కొంతమంది వ్యక్తులలో వంశపారంపర్యంగా లేదా హార్మోన్లలో మార్పులు, మానసిక ఒత్తిడి లేదా ఆందోళన అనేది ఎక్కువ ఆహారం తినడానికి కారణమవుతుంది. మధుమేహమేకాదు, గుండె జబ్బులు,క్యాన్సర్లతో పాటు ఊబకాయం కూడా భారతీయులకు పెనుముప్పుగా పరిణమిస్తోంది. స్థూలకాయులకు ముందుగా చర్చించుకున్న మూడు జబ్బులతో పాటు హృద్రోగంకూడా కలవరపెడుతోంది. ఒక్కొక్కప్పుడు వైద్యానికి కాలాతీతమై కాయం కడతేరుతుంది. భారతదేశంలోనూ స్థూలకాయుల సంఖ్య తక్కువేం కాదని ఎన్నో సర్వేలు చెప్పచూశాయి. దేశంలో ఊబకాయం వలన రోగాలబారిన పడుతున్న 54శాతం మందిలో ఆహారపుటలవాట్లే వాళ్ళను పొట్టన బెట్టుకున్నాయని వైద్యులు తేల్చిపారేశారు. అయినా ఆదిలో కొందరు భయపడకపోయినా ఇప్పుడెందరో లావు తగ్గించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.దేశంలో టైప్ 2మధుమేహం, గర్భాశయ,కాలేయ, వక్షోజ క్యాన్సర్లు, గుండెజబ్బుల పీడితులే అధికంగా ఉన్నారు. ప్రముఖ వైద్య విజ్ఞాన పత్రిక 'లాన్సెట్ గత ఏడాది ప్రచురించిన 2022 నాటి సర్వేవిశేషాలు పరిశీలిస్తే ఐదు నుంచి 19 ఏళ్లలోపువారు 12మిలియన్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారని అంచనా వేసింది. స్థూలకాయానికి తారతమ్యాలు, వయోభేదం వంటి మొహమాటాలు ఏమీ ఉండవు. అన్ని వయసులవారినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. గంటల కొద్దీ కూర్చుని పనిచేసే ఉద్యోగులు ఊబకాయం బారిన పడతారని వింటున్నాం. వారి జీవనశైలి గురించి కూడా చెప్పుకుంటున్నాం. ఎక్కువగా ఐటి ఉద్యోగులు ఒబేసిటీకి లోనవుతున్నట్లు అర్థం చేసుకోవచ్చు. శరీరంలోకి చేరుతున్న క్యాలరీలకు, ఖర్చయ్యే క్యాలరీలకుమధ్య సమతుల్యత లేకపోవడం వల్లనే కొవ్వుశరీరంలో పేరుకుపోయి స్థూలకాయానికి దారితీస్తోందని శాస్త్రజ్ఞులు ఏనాడో చెప్పినా జనం పెడచెవిన పెట్టారు.ఇప్పుడు లబోదిబో మంటున్నారు. కేవలం ఆహారపుటలవాట్లే కాదు. ఒత్తిడి, నిద్రలేమి, ఆందోళన, హార్మోన్ల అసమతుల్యత కూడా స్థూలకాయానికి హేతువులే! ప్రత్యేక విషయమేమిటంటే ఊబకాయులు సాధారణంగా ఆత్మన్యూనతకు, కుంగుబా టుకూలోనై బాహ్య ప్రపంచంలోకి రావడానికి సిగ్గరులు గా మారుతుంటారు. కొంతమంది ఇంతకు ముందు ఉన్న ఆరోగ్య కరమైన జీవనశైలిని విస్మరించి పీకల మీదకు తెచ్చుకుంటున్నారు. శరీరంలో ఒకసారి పేరుకుపోయిన కొవ్వు కరగడమంటే మాటలు కాదు. వ్యాయామంపైదృష్టి పెట్టడం ద్వారా కొంత బరువును తగ్గించుకోవచ్చు. ఈ మధ్య కొంతమంది సెలబ్రిటీలు సన్నబడి ఊబకాయానికి సవాళ్లు విసిరారు. అదే మంచిదే. కానీ వారు అవలం బించిన వ్యాయామమేదో, వారు అంత సన్నగా ఎలా మారారో వారే స్వయంగా చెబితే వినాలని ఉంది.మనం అప్రయత్నంగా స్వీకరించే అధికక్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్ చేయబడిన ఫుడ్,నూనె, చక్కెరలను ఆహార మెనూ నుండి దూరంపెట్టాలి. నూనెవాడకాన్ని తగ్గించేందుకు ప్రధాని మానవాళిని ప్రేరేపిస్తున్నారంటే దాని వల్ల ఉభయ తారకంగా ఉండే ప్రయోజనాలున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, తక్కువ నూనె వాడేఆహారాలు తినడంవల్ల ఊబకాయాన్ని నివారించవచ్చని ఆయనసూచిస్తున్నారు.ప్రజారోగ్యం గురించి చర్చ లేవదీయడం ఆహ్వానించదగినదే. కొందరైనా అప్రమత్తమోతారు.లేకుంటేఏవో ఖరీదైన మందులకు భ్రమపడి ఏనుగులా ఉన్నవాడు,పీనుగులా తయారౌతాదండి కొన్నిఅనుభవాలుచెబుతున్నాయి. బేరియాట్రిక్ సర్జరీల సంగతి తెలిసిందే. ఈ రీత్యాఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడంద్వారా ఊబకాయాన్ని నియంత్రించడం సాధ్యమేనన్న ఉద్దేశ్యం హ్వానించదగినదే!

చెడును విస్మరించి మంచిని సంస్కరించి సంరక్షించుకోవడం యోగ్యత లక్షణం.



స్వామి వివేకానంద

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సిసి కాబ్డన్

# కులగణనపై ఇంత దుష్ప్రచారమెందుకు!

**బీసీలకు,ఎస్సి, ఎస్టీల సంక్షేమానికి కేటాయించే నిధులు, వనరుల పంపిణీ విషయంలో ఇచ్చేది జానడు.. ప్రచారం మాత్రం మూరెడు అన్నట్టు వుంటుంది. అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీలతో పోల్చుకుంటే బడుగులకు కేటాయించే నిధులు నామమాత్రమే. ఉదాహర ణకి మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిగ్యారంటీ పథకం కింద దేశవ్యాప్తంగా 27కోట్ల మందికి 2024-25 సంవత్సరానికి 86,000కోట్ల రూపాయలు కేటాయించగా, అదే సంవత్స రంలో ఎక్సైజ్,కస్టమ్స్ వంటి పన్నులకి సంబంధించి ఒక్క అంబానీకి చెందిన రిలయన్స్ సంస్థలు లక్షా 20వేల కోట్ల రూపాయల మేరకు మినహాయింపులు పొందాయి. అందు వల్ల అధికారంతోపాటు బడ్జెట్ కేటాయింపు,వనరులపంపిణీ జరిగినప్పుడు అది ప్రజాస్వామ్య దేశం అవుతుంది.నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారందరూ తప్పనసరిగా కుల గణనకు మద్దతుపలకాల్సినఅవసరం వుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య

కులగణనకు ఆమోదం తెలిపిన కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల కొంతమంది వ్యక్తులు కులగణన వలస కులతత్వతం పెరుగుతుందనే వాదనలను ముందుకు తీసుకువస్తున్నారు. కులగణన కోరుకుంటున్న వారెవ్వరూ కులపునాదులపై జాతిని నిర్మించాలని కోరుకోవడం లేదు. 75 సంవత్సరాలుగా కొనసాగతున్న రెండు మూడు కులాల పాలనా ఆధిపత్యాన్ని నివారించి, సమాజంలో అన్ని వర్గాలకు పాలనతోపాటు ప్రకృతివనరుల పంపిణీలో భాగస్వామ్యం కల్పించాలని కోరుకుంటున్నారు. నిజానికి స్వాతంత్ర్యం లభించిన వాటి నుంచి నేటి వరకు అగ్రవర్ణ పునాదులపైనే భారతదేశ పాలన కొనసాగుతోంది. దాదాపు ఏడున్నర దశాబ్దాలుగా మూడు నాలుగు కులాలే అధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ గుర్తుకురాని కులతత్వం కేవలం కులగణన చేయడంవల్ల ప్రజలలో కులతత్వం పెరుగుతుందని ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కులగణన చేయడం వల్ల 'ప్రజాస్వామ్యం పలుచన' అవుతుందని కొంతమంది మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. దేశ జనాభాలో కనీసం 10 శాతం కూడా లేని మూడు నాలుగు కులాలకు చెందినవారు, 90 శాతం ప్రజలకు అధికారం, వనరులు అందకుండా చేయడం 'చిక్కనైన ప్రజాస్వామ్యం' ఎలా అవుతుందో అర్థం కావడం లేదు. లెజిస్లేచర్ (చట్ట సభలు), కార్యనిర్వాహణ (ఎగ్జిక్యూటీవ్), న్యాయ (జుడిష్యరీ) వ్యవస్థలతో కూడినదే ప్రజాస్వామ్యం మొత్తం 543 లోక్‌సభ స్థానాలలో బీసీ వర్గాలకు చెందిన లోక్‌సభ సభ్యుల సంఖ్య 26శాతం దాటలేదు. 18వ లోక్‌సభ(ప్రస్తుత)లో ఒబీసీల సంఖ్య 140 నుంచి 145 మంది మాత్రమే ఇక సివిల్ సర్వీసులలో, వివిధ ప్రభుత్వశాఖలలో పనిచేసే ఉన్నత ఉద్యోగాలలో సమాజంలో 52 శాతం (మండల కమిషన్ నివేదిక ప్రకారం) కలిగిన బీసీ కులాల వాటా 20 శాతం మించలేదు. న్యాయవ్యవస్థకు వస్తే భారత దేశంలో వున్న మొత్తం 25 రాష్ట్ర హైకోర్టులలో 2018, జులైనాటికి మొత్తం జడ్జీల సంఖ్య 1125, వీరిలో ఒబీసీల సంఖ్య కేవలం 93మంది, ఎస్సీలు 25, ఎసిటి 17 మంది మాత్రమే. ఇక సుప్రీం కోర్టులో పనిచేస్తోన్న మొత్తం జడ్జీల సంఖ్య34, వీరిలో ఒబీసీ సామాజికవర్గానికి చెందినవారు కేవలంఒకరు మాత్రమే. ఈ విషయాలను ఇటీవల రాజ్యసభలో సిపిఎం సభ్యులు జాన్ బిటాస్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ ప్రకటించింది. ప్రజాస్వామ్యంలో లెజిస్లేచర్, ఎగ్జిక్యూటీవ్, జుడిష్యరీలను మూడు స్తంభాలుగా, మీడియాను నాలుగో స్తంభంగా పేర్కొంటారు. ఇక మీడియా, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో బడుగుల వాటా ఎంతో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కులగణన వల్ల ప్రజలలో కులాల దృష్టి పెరుగుతుందని వ్యాసంలో ప్రస్తావించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటివరకు కులమే ప్రధాన పాత్ర వహించడం జగమెరిగిన సత్యం. వివిధ రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో కులం తొలి ప్రాధాన్యత. ఆ తర్వాత ప్రాధాన్యం ఆర్థిక వనరులు. వీటికి ఆయా పార్టీలు పెట్టిన ముద్దుపేరుగెలుపు గుర్రాలు. ఉదాహరణకి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 4 శాతం జనాభా కలిగిన కమ్మ సామాజిక వర్గం నుంచి 36 మంది శాసన సభ్యులు, 5 శాతం వున్న రెడ్డి సామాజిక వర్గం



నుంచి 32 మంది, 10 శాతం జనాభా కలిగిన కాపుల నుంచి 18 మంది శాసన సభ్యులు, 0.6 శాతం జనాభా కలిగిన క్షత్రియ సామాజిక వర్గంనుంచి ఏడుగురు,4 శాతం జనాభా కలిగిన వైశ్య, బ్రాహ్మణ వంటి ఇతర ఒసి కులాల నుంచి 4శాసన సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఎస్సి, ఎస్టీలకు రాజ్యాంగ రక్షణ వుండటం వల్ల వారి జనాభా నిష్పత్తి ప్రకారం 29మంది ఎస్సీలు, ఎడుగురు ఎస్టీ శాసన సభ్యులు వున్నారు. ఇక 52 శాతం జనాభా కలిగిన బీసీ కులాలకు సంబంధించి కేవలం 40 మంది శాసన సభ్యులు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమైన రాజకీయ పార్టీలకు తమని లౌకిక పార్టీలని,బీసీల పార్టీలని చెప్పుకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ తరపున కమ్మేతరులు, వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ తరపు రెడ్డేతరులు, ఒకవేళ జనసేన అధికారంలోకి వస్తే కాపేతర సామాజిక వర్గాలను ముఖ్యమంత్రులు కాగలరా? పాము ఎన్ని మెలికలు తిరిగినా పుట్టలోకి వెళ్లే సమయంలో సాఫీగానే వెళ్లినట్టుగా రాజకీయపార్టీ నేతల ఎన్నికలకు ముందు బీసీలకు అత్యంత ప్రాధాన్యత, బీసీలకు ప్రత్యేక బడ్జెట్టు అంటూ కబుర్లు చెప్పినా చివరకు వచ్చే సరికి మొత్తం జనాభాలో 10 శాతం కూడా లేని అధిపత్యాల కులాలదే ఆధిపత్యం అవుతుంది. అందువల్ల కులగణన వల్ల కొత్తగా ప్రజలలో కులాలపై దృష్టిపెరగడం అంటూ ఏమీవుండదు.స్వాతంత్ర్యం వచ్చి ఏడున్న దశాబ్దాలు దాటుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్లో కుమ్మరి, కమ్మరి, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, మేదర, గంగిరెడ్డుల వంటి అత్యంత వెనుకబడిన కులాలు ఇప్పటి వరకు చట్టసభల మెట్టుఎక్కలేదు. బండ, మొండి, కాటిపాల, పెరిక ముక్కుల, దాసరి, బుడబుక్కల, పిచ్చికుంట్ల, పాముల, దమ్మలి, ఉప్పర, గౌడజెట్టి, కాకిపడగల, అద్దపు సింగులు, గౌడజెట్టీలు వంటి దాదాపు 96కులాలకు అధికారం అంటే, ఏమిటో కూడా తెలియదు. ఊరిలో జీవించే ఈకులాల సంగతి ఎలావున్నప్పటికీ సంచారజీవనం,యాచన వృత్తి కలిగిన వారికి ఆధార కార్డులు,బియ్యం కార్డులు కూడ లేకుండా ఊరిబయట గుడిసెలలో జీవిస్తున్నారు. ఇటువంటి వారిని కనీసం పౌరులుగా గుర్తించాలన్న కులగణన చేయడం అనివార్యం.ఒబిసి కులాల కేటగిరీల డివిజన్కు సంబంధించి కేంద్రప్రభుత్వం నియమించిన జస్టిస్ రోహిణి కమీషన్ ఇటువంటి సంచార, విముక్తి కులాల గురించే ప్రధానం నివేదికలో ప్రస్తావించారు. కులగణనతోపాటు ఈ నివేదికను కూడా బహిర్గత పర్చాల్సిన అవసరం వుంది. కులగణన చేపడితే ఒక ప్రతి పది సంవత్సరాలకు కులగణన జరిగితే ఏవో ఘోరాలు జరిగిపోతాయనే భావనకూడా వ్యక్తంచేశారు. ప్రతి పది సంవత్సరాలకు కులగణన జరిగితే తమ జనాభా నిష్పత్తి కంటే అత్యధికంగా అధికారం అనుభవిస్తున్న వర్గాల నుంచి అధికారం చేజారిపోవడం మినహా ఏమీ జరగదు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ప్రతి 10ఏళ్లకు జనాభాగణనతో పాటు షెడ్యూల్‌కులాల,షెడ్యూల్ తెగల జనాభా గణన జరుగుతూనే వుంది. వారికి కేటాయించిన సీట్లు వారు పొందడం మినహా అదనంగా ఒక్క స్థానం కూడా పొందడం లేదు. అయినా బడుగువర్గాలకు చెందిన వారు అన్ని సీట్లు మాకే కావాలని కోరడం లేదు, "మేకెంతో మా కంత" అనే నినాదంతో తమ జనాభా నిష్పత్తి ప్రకారం తమకు చట్టసభలలో స్థానాలు కావాలని మాత్రమే కోరుతున్నారు. సంక్షేమం పేరిట బడుగులకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్లరూపాయలు వృధాచేస్తోందనే భావనలో అధిపత్య కులాలకు చెందినవారు వుంటారు.బీసీలకు,ఎస్సి, ఎస్టీల సంక్షేమానికి కేటాయించే నిధులు, వనరుల పంపిణీ విషయంలో ఇచ్చేది జానడు.. ప్రచారం మాత్రం మూరెడు అన్నట్టు వుంటుంది. అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీలతో పోల్చుకుంటే బడుగులకు కేటాయించే నిధులు నామమాత్రమే. ఉదాహరణికి మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిగ్యారంటీ పథకం కింద దేశవ్యాప్తంగా 27కోట్ల మందికి 2024-25 సంవత్సరానికి 86,000కోట్ల రూపాయలు కేటాయించగా, అదే సంవత్సరంలో ఎక్సైజ్,కస్టమ్స్ వంటి పన్నులకి సంబంధించి ఒక్క అంబానీకి చెందిన రిలయన్స్ సంస్థలు లక్షా 20వేల కోట్ల రూపాయల మేరకు మినహాయింపులు పొందాయి. అందు వల్ల అధికారంతోపాటు బడ్జెట్ కేటాయింపు,వనరులపంపిణీ జరిగినప్పుడు అది ప్రజాస్వామ్య దేశం అవుతుంది.నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారందరూ తప్పనసరిగా కుల గణనకు మద్దతుపలకాల్సినఅవసరం వుంది.

# అభివృద్ధిని వెక్కిరిస్తున్న బాల కార్మిక వ్యవస్థలు

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి

బానిసత్వ దురాచారం అనాదిగా మానవాళిని పట్టి పీడిస్తున్నది. డిజిటల్ వెలుగుల నీడన బలవంతపు వెట్టిచాకిరి చీకట్లు కమ్ముకున్నాయి. బానిసత్వం అమానవీయం, మానవ హక్కుల హననం. బానిసత్వం ప్రపంచ దేశాలన్నింటిలో విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల అణగారిన వర్గాల ప్రజలు బలవంతంగా ఆధునిక బానిసత్వ సంకెళ్లలో బంధించబడి జీవితాలను కటిక చీకట్లలో గడుపుతున్నారు. వీరిలో 28 మిలియన్లు బలవంతపు శ్రమ, 22మిలియన్లు బలవంతపు వివాహాల వలయంలో చిక్కుకొని బతుకులు దుర్భరంగా గడుపుతున్నారు. ఒకవ్యక్తి కడు పేదరికాన్ని బలహీనతను ఆసరాగా చేసుకొని అక్రమంగా బలవంతంగా శ్రమకు నియమించుకోవడం, లైంగిక హింసకు గురి చేయడం, బాల్య వివాహాలు చేసుకోవడం, బాల కార్మికులు, యుద్ధ సంక్షోభాల్లో పిల్లల చేతుల్లో ఆయుధాలు పెట్టడం, వెట్టిచాకిరిని ప్రోత్సహించడం, పరిశ్రమల్లో చిట్టి చేతులను బంధించడం లాంటి దురాచారాలను బానిసత్వ రూపాలుగా చెప్పుకుంటున్నాం. అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినం2025 ఇలాంటి అమానవీయ ఆధునిక బానిసత్వ దురాచారాన్ని రూపుమాపడానికి ఐరాస చొరవ తీసుకొని ప్రతి ఏటా 02 డిసెంబర్ రోజు అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ అబాలిషన్ ఆఫ్ స్లేవరీ)' పాటించడం 2016 నుంచి కొనసాగుతున్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బానిసత్వం, బలవంతపు వివాహాలు జరగడం విచారకరం. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2021 వివరాల ప్రకారం ప్రపంచ దేశాల్లో28 మిలియన్ల ప్రజలు బానిసత్వ చీకట్లలో మునిగి పోయారని, వీరిలో అధికంగా ఏసియా పసిఫిక్ దేశాలు, యూరోప్ సెంట్రల్ ఏసియా, ఆఫ్రికా, అమెరికా, అరబ్ దేశాల్లో బానిసత్వం విస్తరించుట గమనించారు. పరిశ్రమలు, వ్యవసాయం, గృహ పనులు, సేవా సంస్థల్లో బానిసత్వ కోరలు అధికంగా వ్యాపించి ఉన్నాయి. దక్షిణాషియా, ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, నేపాల్‌లో పేదరికం అధికంగా ఉండడంతో బానిసత్వ దురాచారం వేళ్లూనుకొని ఉన్నది. భారత్‌లో 3కోట్లబానిసలు బతుకులు భారంగా ఈడ్చుతున్నారు. భారతంలో బానిసత్వ దురాచారం అనేక రూపాల్లో ఉన్నాయి. ప్రాచీన కాలంలో బానిసల నుదుటిపై కాల్చిన కడ్డీలతో శాశ్వతగుర్తులు కూడా వేసే విషసంస్కృతి అమలైంది. వినని వారిని కొరడాలతో కొట్టడం, చీకటి గదుల్లో బంధించి ఆహారం ఇవ్వకపోవడం కూడా జరిగేది.రుణబంధన వ్యవస్థ, వెట్టిచాకిరి, శ్రమ దోపిడీ,బలవంతపు పెళ్లిళ్ల ఆధునిక బానిసత్వ రూపాలుగా కొనసాగుతున్నాయి. బానిసత్వ దురాచారానికి పేదరికం, కులం,సామాజిక అసమానతలతో విడదీయరాని సంబంధం ఉంటుంది. ఇటుక బట్టీలో మాడుతున్న బాల్యాలు, బాల్య వివాహ సంకెళ్లు, బాణాసంచా తయారీ కేంద్రాల్లో విష విస్పోటక పదార్థాలతో పిల్లలు నలిగిపోవడం లాంటివని డిజిటల్ యుగంలో కూడా కొనసాగుతున్నాయి. చట్టాలు ఎన్ని ఉన్న బానిసత్వ దురాచారం రెచ్చిపోతూనే ఉన్నది. బానిసత్వ దురాచారం నేర సమానం,ఆక్షేపణీయం. అభివృద్ధి భాషణాలు ఒకవైపు, ఆకలికేకలు మరోవైపు వినిపిస్తూనే ఉన్నాయి.బానిసత్వ దురాచారం జడలు విప్పుతూనే ఉన్నది. చట్టాలు కాగితాల్లో పదిలంగానే ఉన్నాయి. వంటింటిలో చిట్టి బానిస చేతులు బోళ్లు తోముతూనే,బట్టలు ఉతుకుతూనే ఉన్నాయి. బానిసత్వాన్ని బొందపెట్టని ప్రగతి నిరర్థకం.బానిసత్వాన్ని పోషిస్తున్న పౌరసమాజం మానవ విలువలను మంటగలుపుతున్నాయి.

# ప్రజావాక్కు



## మూఢ నమ్మకాలు నశించాలి

ఈమధ్య ఒగృహానికి శంకుస్థాపనకువిచ్చేసిన ఓ సామాన్య గృహస్తుడు తన తల్లితోరాగా దానిని తనసమక్షంలో నిర్వహించడానికి తెలంగాణా రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు గారు విచ్చేసారు. ప్రారంభోత్సవానికి కొబ్బరికాయ కొట్టడానికి ఆ సామాన్యుని భార్యను ఆదేశించగా ఆమె నిండు గర్భవతి కావడంవలన రాలేకపోయిందని చెప్పగా అక్కడే ఉన్నఅతని తల్లిని ఆపూజా కార్యక్రమానికి పిలువగా ఆమె తాను వితంతువని నిరాకరించింది. అప్పుడు మంత్రి వరేర్యులుకల్పించుకుని ఆమె చేతే కార్యక్రమం నిర్వహింపజేసారు.వితంతువులను అపశకునంగా ఏ సందర్భంలోనూ చూడకూడదని వారిని అందరిలాగే గౌరవంగా చూడాలని మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలని మంత్రి గారు తెలియజేసారు. మూఢ నమ్మకాలు నశించాలి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## వణికిస్తున్న టీబీ

ప్రపంచాన్ని ఇప్పటికీ వణికిస్తున్న ప్రాణాంతక అంటువ్యాధుల్లో క్షయ(టీబీ) ఒకటి. ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజాగా విడుదల చేసినగ్లోబల్ ట్యూబర్క్యులోసిస్ రిపోర్ట్ 2025 ప్రకారం,2024లో ప్రపంచవ్యాప్తంగా1.07కోట్ల కేసులు, 12లక్షలకుపైగా మరణాలు నమోదయ్యాయి. ప్రపంచంలోని మొత్తం టీబీ కేసుల్లో నాలుగో వంతు భారత్‌లోనే ఉండటం అత్యంత ఆందోళనకరం. 2025నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చాలన్న లక్ష్యం ఎందుకు ఇంకా దూరంలోనే ఉందనే ప్రశ్నసహజం.భారత్‌లో టీబీ నిర్మూలనకు ప్రధానఆటంకం వ్యాధి నిర్ధారణలో జాప్యం. లక్షణాలున్నా పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల అనేక కేసులు బయటపడకపోవడం, అంతరంగా వ్యాప్తి చెందుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మూడో ప్రపంచ యుద్ధం!

2030లోగారష్యా, నాటోకూటమితో యుద్ధానికి సన్నద్ధం కావాలని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టో హెచ్చరిక జారీచేశాడు.ఇరాన్,పాకిస్థాన్, స్పేడన్, ఐర్లాండ్ దేశాలను శత్రుదేశాలుగా గుర్తిస్తున్నామని ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు ప్రకటించాడు. రష్యా నాటో మీద, ఇజ్రాయిల్ ఇరాన్ మీద, చైనా తైవాన్ మీద దాడి చేస్తేమూడో ప్రపంచ యుద్ధం జరిగే అవకాశం ఉంది.

- పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## ఫ్యాషన్ ప్రపంచానికి జిల్లాల వెలుగు

తెలంగాణలోని చందూరు ప్రాంతం చారిత్రకమైన చేతి నేస్తాల్లో ప్రసిద్ధిపొందిన ప్రాంతం.అక్కడి వీవర్లు తరతరాలుగా వస్త్రోత్పత్తిని తమ వృత్తిగా కొనసాగిస్తూ, సంప్రదాయాన్ని సంరక్షించడమే కాకుండా కొత్త ధోరణులను స్వీకరించే సామర్థ్యాన్ని ప్రతి స్ఫూరింపజేస్తున్నారు. తాజాగా చందూరు వీవర్లు రూపొందించిన వినూత్న డిజైన్లు, ఆధునిక రంగుల సమన్వయం, ప్రత్యే కమైన మగ్గనిర్మాణం దేశవ్యాప్తంగా ఫ్యాషన్ ప్రపంచంలో చర్చ నీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో ప్రజలు చేతి నేస్తా లపై మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. ఈ అవకాశాన్ని చందూరు వీవర్లు సద్వినియోగం చేసుకుంటూ సంప్రదాయ పట్టు, కాటన్ చీరలకు ఆధునిక శైలి జోడించారు. ముఖ్యంగా యువతను ఆకర్షించే విధంగా లైట్‌వెయిట్ ఫ్యాబ్రిక్స్, జ్యామితీయ నమూ నాలు,సాఫ్ట్‌కలర్ కాంబినేషన్లు వినియోగించి ప్రత్యేకమైన వస్త్రా లు తయారు చేస్తున్నారు. వీరి చేతిపనిలో కనిపించే నైపుణ్యం, నూలుజాడల మధ్య ఉండే కచ్చితత్వం, రంగుల సమతుల్యత - ఇవన్నీ ప్రపంచ స్థాయి డిజైనర్లను కూడా ఆకర్షిస్తున్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ఖంగు తింటున్న సర్పంచ్ అభ్యర్థులు

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్న పాలకులను ప్రజలు ఎన్నుకుంటున్న ప్రజా సమస్యలు మాత్రం మారడం లేదు. ప్రతిఎన్నికల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ సర్పంచిగా ఎన్నికైన తర్వాత ఆ గ్రామంలో ప్రజలకుమౌలిక సదుపాయాలు కల్పనలో సర్పంచులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికలకుప్రభుత్వం సిగ్నల్‌ఇవ్వడంతో పోటీ చేసే అభ్యర్థులపై ఆయా గ్రామంలో ప్రజలు ఖంగు తింటున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## వ్యవస్థలు బాగా పని చేయాలి

దేశంలోని ముఖ్యమైన వ్యవస్థలు సక్రమంగా పని చేయాలి. పోలీసు,చట్టాలు, చట్టసభలు, ఇతర రంగాల ఉద్యోగులు, పౌరులు బాగా పని చేయాలి. వ్యవస్థలను నియంత్రించి అణచివేసేది రాజకీయ శక్తులు కాబట్టి వ్యవస్థలుఅప్రమత్తంగా ఉంటే సరిపోతుంది. వ్యవస్థలు ఎవరి వత్తిళ్లకు లొంగకూడదు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్క పౌరులు నిజాయితీగా పనిచేయాలి. అప్పుడే శాంతియుత స్వతంత్ర దేశంగా ఉంటుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

మన విని

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

e-mail: editpage@vaartha.com

# చర్చించి పరిష్కరించడమే ప్రజాస్వామ్య సూత్రం



రావులపాటి సీతారాంరావు

ప్రజాస్వామ్యంలో చర్చలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులే కాదు ఇంగితజ్ఞానం ఉన్న ప్రతి వ్యక్తీ నమ్ముతాడు. దురదృష్ట వశాత్తు ప్రస్తుతం డిబేట్లు అంటే చర్చలు అటు చట్టసభలలోనూ ఇటు టీవీల్లాంటి దృశ్యసాధనాల్లోనూ నిరర్థకంగా తయారవుతున్నాయి. అర్థవంతమైన పరిష్కారాలు ప్రతిపాదించి వీక్షకులకు రోజువారీ సమస్యల పైనా, ప్రభుత్వాలూ, ప్రతిపక్షాలూ వ్యవహరించే తీరుపైనా నిర్ణ యాల ప్రభావాలపైనా సమసగ్రమైన విషయాలు అందించడానికి బదులు, గొడవలూ కొండొకచో పోట్లాటలుగంపగుత్తుగా ఇచ్చే వ్యవస్థలుగా మారాయి. సోషల్ మీడియా సరేసరి! వాళ్ల సబ్జెక్టుకు పెట్టే హెడ్డింగ్ కూడా చూపించే కార్యక్రమానికీ పొంతనలేకపోగా, అసలు లింక్ అనేదే లేకపోవటం హాస్యాస్పదంగా మారుతున్నది. కామెడీ కోసమే ఇలాంటివి చూసే పరిస్థితులు క్రమేపీ హద్దులు దాటుతున్నాయి. డైలాగ్, డిబేట్, డిస్కషన్ అన్నీ చర్చల్లో పాల్గొనేవారి చేతుల్లో చావుదెబ్బలు తింటున్నాయి. వాయిలెంట్ సినిమాల కంటే ఛానెళ్లు,గొప్పగొప్ప వ్యవస్థ ఛానెళ్లు కూడా తలా తోకా లేని, అర్థంపర్థం లేని, అవసరం లేని, కార్యక్రమాలు ప్రసారం చేస్తూ (సరదాగా చెప్పకోవాలంటే) వీక్షకులకు మానసిక వ్యధను కలిగిస్తున్నారు.చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన స్థితిని ఎవరన్నా చెప్పినా, హాస్యోక్తిగా కొట్టి పారేయటం తగదు. ప్రభుత్వాలు తప్పకచర్యలు తీసుకోక తప్పదు. శ్రుతి మించిన రాగం,అపస్వరాల విజృంభణతో నానాయాగీ చేస్తున్న మాటనిజం! ఈ మధ్య ఎవరైనా హేతుబద్ధంగా చర్చల్లో పాల్గొనటానికి ప్రయత్నిస్తే హాహాకారాలు చేసే ఎదుటి డిబేటర్ పరిహాసపూర్వకంగా నవ్వటమే కాదు, కాసేపటికి బాల్లే ఆపు!పిచ్చిమాటలు కొనసాగిస్తే. తిట్ల దండకంప్రారంభిస్తాడు. బుద్ధిమంతుడు నివ్వెరపోయి, తలతిరిగి మరోమాటలేకుండా తలొంచుకొని డిబేట్ అయ్యేంతవరకూ నోరువిప్పడు.యాంకర్ కూడా అతన్ని మురికికూపంలోకి లాగేప్రయత్నంచేయడు, యాంకర్ అప్పటికే అందులో నిండా మునిగి ఉన్నాడు కనుక. ఆ వ్యకినతరువాత ఏ ఛానెల్‌లోనూ డిబేట్లలోనూ కనపడలేదు! బుద్ధిజీవులు హమ్మయ్య ఊ అని ఊపిరిపీల్చుకున్నారు!అతని నిష్క్రమణ అతనికే మేలు చేస్తుంది కాబట్టి! అవసరాన్ని మించిన హైరానా ఎందుకోసం ఈ డిబేటర్లకూ, డిస్కషన్ దారులకు అని సామాన్యుడు తలపోస్తాడు కానీ తలపండిన వారికే తెలియదు అందులోని మర్మం! తెలిసిన ఒక డిబేటర్‌ను అసలు రహస్యమేమిటో తెలుసుకుందామని అడిగినప్పుడు నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా? అని పాత సినిమా పాతాళాభైరవిలో కథానాయకుడిలా అడిగాడు, అడిగినవాడు మాట్లాడలేదు. ఎందుకైనా అతగాడి విరుపులకు, మెరుపులకూ వింత వింత శబ్దాలకు భయపడి నిశ్శబ్దాన్ని ఆశ్రయించి మౌనవ్రతాన్ని సాగించాడు. మౌనవ్రతాన్ని గర్వంగా స్వీకరించిన డిబేటర్ గొంతు సవరించుకొని ఆయన డిబేట్‌లో ధరించే వీరావతార రహస్యాన్ని సెలవిచ్చాడు. అఫెన్స్ బెస్ట్ డిఫెన్స్ ఎదుటి వాడు నా ప్రతిపక్ష పార్టీ వాడు, మొదట్లోనే మాటల్లో ఫెడేల్ మని మనం చరవకపోతే మనల్ని మరుక్షణమే చానబాదుతాడు. పాత రోజుల్లో డిబేట్లు ఊరేసిన మగాయాల్లాంటివి. ఎప్పుడో గాని మాగి రుచికెక్కవు! ఇప్పటి డిబేట్లు గుంటూరు మిరపకాయల్లాంటివి. నాలుక కొరకగానే రాలిపడిపోవాలి.మాటరాకుండా ప్రత్యర్థి గుడ్లు తేలేయ్యాలి. ఘాటు డిబేట్ రహస్యం అదే. హైపిచ్‌లో సందేశాన్ని ఇచ్చాడు. సీరియస్‌గా విషయం విశ్లేషణకు వస్తే సమాజాన్ని రెండుగా చీల్చేందుకు అన్ని వ్యవస్థలూ పని చేస్తున్నాయా అన్న సందేహం కలగక మానదు. మార్పు సహజం అని మంచి చెడులు ఆలోచించే వ్యక్తులు ఇంతకు మునుపు అనుకొనేవారు కానీ ప్రస్తుతం మార్పు స్వార్థంతో కూడుకున్నదిగా కనిపిస్తున్నది. వ్యక్తి స్వార్థం తాను పనిచేసే పార్టీ స్వార్థం ( రాజకీయాల్లో ఉంటే) ఉద్యోగంలో ఉంటే ఆ వ్యవస్థ స్వార్థంగా ప్రస్తుత మార్పు సూత్రాన్ని అన్వయించుకోక తప్పదు. అందుకనే ఇవ్వాళ చర్చల్లో పాల్గొనేవారు ఒకే రకమైన కోపాన్ని అసహనాన్ని తాను వ్యతిరేకించే పార్టీ మీదనో, వ్యక్తి మీదనో ప్రదర్శించినా, తాను పార్టీ మారితే అదే రకమైన వ్యతిరేకతను, అసహనాన్ని అదే మోతాదులో తన పాతపార్టీపైన కూడా ప్రదర్శించే నేర్పు ఉండాలి అని అతనూ అనుకుంటాడు. అతన్నికొత్తగా చేరుకున్న పార్టీ అనుకుంటున్నది. సీసాలు మారినా, సీసాల రంగు మారినా పాత రసాన్ని నింపటమే చేయాల్సిన కర్తవ్యం. ప్రస్తుత సమాజంలో నీవు అటో ఇటో ఉండక తప్పటం లేదు. మరోవిధంగా ఆలోచించే వారికి మరోమార్గంలేక మౌనంగా ఉండక తప్పటం లేదు. న్యూట్రల్‌గా ఉంటూ న్యూటాలిటీని సమర్థించ ప్రయత్నించటం అసాధారణ చర్యగా, ధైర్యంతో కూడుకున్నపనిగా శ్లాఘించకతప్పదు. అలాంటి వారికి సహకారం,సహాయం, దాదాపు దుర్లభం. కులం, మతం, ప్రాంతం, పార్టీ, సమర్థించుకోవటంవిధిగాపెట్టుకున్న ఈనవ సమాజంలో మంచి చెడుల బేరీజుకు విలువలేనట్లు కనిపిస్తున్నది. విలువల కంటే చర్చల్లో విరుపులు మెరుపులకే విలువనిస్తున్నారు. వాదనలు సమాజాన్ని చీల్చటానికే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. చెన్నై హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న జస్టిస్ ఆనంద్ వేంకటేష్ ఒక పేపర్‌లో సమాజంలో పడిపోతున్న గౌరవాన్ని ఓపెన్ డైలాగ్‌ను తిరిగి తెచ్చుకొనే విధంగా ప్రయత్నాలు చేయాలని రాయటం, అదీ ఉద్యోగంలో ఉంటే ఆ విలువైనమాటలు చెప్పటం చాలాసంతోషంతో పాటు, బాధ్యతను గుర్తుకు తెచ్చింది. వారే జే గార్ ఫీల్డ్ అనే ఫిలాసఫర్ హెచ్చరికను కూడా ఆవ్యాసంలో ప్రస్తావించారు. ఈ విధంగా సమాజం రెండుగా చీల్చటం మంచిది కాదని, అట్లాంటి చీలిక అన్నివైపులా ఆలోచనను పెంపొందించే ప్రక్రియను పూర్తిగా నాశనం చేసి, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆహెచ్చరికను ఉటంకించారు. అలాంటి అరమరికల్లేని, వినయంతో కూడిన మాటలతో ప్రత్యర్థులను సమానస్థాయిలో తోటిమానవులుగా శత్రువులుగా కాకుండా చర్చల ద్వారా సంభాషణల ద్వారా సంబంధం ఏర్పరుచుకోగలుగుతే ఆ చీలికను పోగొట్టి సమాజాన్ని ఒకటిగా చేయొచ్చు అని జేగార్ ఫీల్డ్ అభిప్రాయపడ్డారు. వాదనల ద్వారా, ఆవేశకావేషాల ద్వారా సమాజానికి మేలు జరగదు.ప్రజాస్వామ్యంలో చర్చలూ, వాదనలు అవసరమే కానీ ఆవాదనలూ, ఆవేశాలూ,సమాజాన్ని నిలువునా చీల్చడానికి కానేకాదు. ఆ ఎరుక ప్రతివారికీ ముఖ్యంగా ప్రజాప్రతినిధులకూ,రాజకీయ నాయకులకూ ఉండకతప్పదు. 'నేను గౌరవ ప్రదంగా నా అంగీకారాన్ని తెల్పుతున్నాను' నేను నీతో విబేధించినా,నీ అభిప్రాయాన్ని గౌరవిస్తాను అన్న ఏకైక సిద్ధాంతం మీద ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్య మనుగడనే దెబ్బతీసే వాదనలూ,చర్చలూ ఎందుకు? వ్యక్తి, వ్యవస్థల, పార్టీల స్వార్థానికా? కానేకాదు.ప్రజాప్రయోజనానికి అందరి అభిప్రాయాలవసరం.అభిప్రాయాలు వ్యక్తపర్చటానికే చర్చలూ!వాదనలూఅవసరం.బంధాలు తెంపుకోటానికి కాదు.

# శ్రీలంకను కుదిపేసిన 'దిత్వా'

## 334కు పెరిగిన మృతులు, 370 మంది గల్లంతు



**కొలంబో, డిసెంబరు 1:** దిత్వా తుఫాన్ శ్రీలంకను కుదిపేస్తున్నది. ఇళ్లు కూలిపోవడం, పట్టణాలు జలమయమవడం, కొండచరియలు విరిగిపడటంతో వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్డు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం ఆదివారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 334 మంది మరణించగా, 370 మంది ఆచూకీ గల్లంతయింది.
ఈ సంక్షోభ సమయంలో భారతదేశం 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో సహాయప దుతున్నది. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), భారత వాయుసేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి. భారత ప్రభుత్వం శ్రీలంకకు 21 టన్నుల మానవతా సాయాన్ని అందజేసింది. విశాఖపట్నం నుంచి బయల్దేరిన ఐఎన్ఎస్ సుకన్య త్వరలోనే మరింత మానవతా సాయాన్ని అందించబోతున్నది. కాగా, దిత్వా తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తుఫాన్ కారణంగా తమిళనాడులో ముగ్గురు మృతి చెందారు.

**ఇండొనేసియాలో 442కు చేరిన మృతుల సంఖ్య**

**సుమత్ర:** సెనార్ తుఫాన్‌తో ఇండోనేసియా అతలాకులమైంది. ఆ తుఫాన్ వల్ల సుమారు 442 మంది మరణించారు. భారీ వరదలు పెను నష్టాన్ని కలిగించాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. థాయ్‌లాండ్, మలేసియాలో కూడా విధ్వంసం జరిగింది. థాయ్‌లో సుమారు 170 మంది మరణించారు. సెనార్ తుఫాన్‌తో దెబ్బతిన్న ఇండోనేసియాలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. సుమత్ర దీవుల్లో నష్టం భారీగా ఉన్నది. వేలాది మందికి ఆహారం అందడం లేదు. కొన్ని చోట్ల వరదల వల్ల బిల్డింగ్, ఇళ్లు కొట్టుకుపోయాయి. ఫిలిప్పీన్స్, శ్రీలంకతో పాటు దక్షిణాసియా దేశాల్లో వచ్చిన తుఫాన్ల వల్ల ఈ నెలలోనే 900 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది.
కేవలం నార్త్ సుమత్ర దీవుల్లో వరదల వల్ల సుమారు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 200 మంది గల్లంతయ్యారు. డ్యామేజ్ చాలా తీవ్రంగా ఉన్నట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ కూడా అందడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆహారం కోసం అలమటిస్తున్నారు. సెనార్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవ్ సుబియాంటో పర్యటిస్తున్నారు.



# బంగ్లా రైఫిల్స్ తిరుగుబాటు వెనుక మాజీ ప్రధాని హసీనా!

**ఢాకా, డిసెంబరు 1:** బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష వేసిన విషయం తెలిసిందే. కాగా 16 యేళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన రైఫిల్స్ తిరుగుబాటు వెనుక హసీనా ఉన్నట్లు ఆ ఘటనపై దర్యాప్తు చేస్తున్న కమిషన్ తాజాగా ఆరోపించింది. నాడు హసీనానే స్వయంగా తిరుగుబాటుకు ఆదేశించారని విచారణ తేలినట్లు పేర్కొంది. 2009లో జరిగిన ఈ తిరుగుబాటు సమయంలో బంగ్లా ఆర్మీని బలహీనపర్చేందుకు భారత్ యత్నించిందని కమిషన్ ఆరోపించింది. దీనిపై ఆంగ్లపత్రిక ఎఎఫ్‌పి వెలువరించిన కథనాన్ని కమిషన్ ప్రస్తావించింది. హసీనా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత.. 2009లో బంగ్లాలో జరిగిన రెండు రోజుల తిరుగుబాటులో అగ్రసైనిక అధికారులతో సహా 74 మంది మరణించారు. గతేడాది హసీనా స్వదేశాన్ని వీడిన తర్వాత అనంతరం ఏర్పాటైన యూనస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తునకు ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తిరుగుబాటుపై విచారణ చేసిన కమిషన్ తాజాగా తన నివేదికను విడుదల చేసింది. అందులో హసీనాపై ఆరోపణలు చేసింది. అప్పటి అవామీ లీగ్ ప్రభుత్వ నేతలు కూడా తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పేర్కొంది. హసీనా ఆదేశాలతో మాజీ ఎంపి ఫజ్లే నూర్ తపోష్ దీనిని ముందుండి నడిపించినట్లు వెల్లడించింది. ఆ సమయంలో జరిగిన హత్యలకు హసీనానే కారణమని ఆరోపించింది.

**భారత్‌పై ఆరోపణలు:** రైఫిల్స్ తిరుగుబాటు సమయంలో హసీనాకు మద్దతుగా నిలిచిన భారత్.. బంగ్లాలో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించినట్లు కమిషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సమయంలో 921మంది భారతీయులు ఢాకాకు వచ్చారని వారిలో 67మంది ఎక్కడ ఉన్నారో ఇప్పటికీ తెలియరాలేదని పేర్కొంది. వీటిపై భారత్ ఇంకా స్పందించలేదు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠంనుంచి దిగిపోయిన షేక్‌హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. ఆమె పలు కేసుల్లో దోషిగా ఉన్నందున తిరిగి బంగ్లాకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారత్‌ను కోరింది.



# కేరళ సిఎంకు ఇడి షాక్

## 'ఫెమా' ఉల్లంఘన కేసు

**తిరువనంతపురం, డిసెంబరు 1:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాకిచ్చింది. విజయన్‌తో పాటు ఆయన వ్యక్తిగత కార్యదర్శి అబ్రహం, ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్ కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం నిధులు సమీకరించే ప్రభుత్వ సంస్థ కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కేఐఐఎఫ్‌బీ) 2019లో జారీ చేసిన మసాలా బాండ్‌ల వ్యవహారంలో ఈ నోటీసులు జారీ చేసింది. నిధుల సేకరణలో ఫెమా మార్గదర్శకాలను పాటించలేదన్న ఈడీ ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేరళలోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి కేఐఎఫ్ బీ 2019 లో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సుమారు రూ.2,150 కోట్ల విలువైన మసాలా బాండ్ లను జారీ చేసింది. ఈ నిధుల సమీకరణ మరియు వాటి వినియోగంలో ఫెమా నిబంధనలను పాటించలేదని, ఆర్బీఐ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించిందనేది ప్రధాన ఆరోపణ. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన కేఐఐఎఫ్‌బీ కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ మార్కెట్ల నుండి నేరుగా రుణాలు తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అయితే, కేఐఐఎఫ్‌బీ తన కార్యకలాపాలు చట్టబద్ధంగా, ఆర్బీఐ మార్గదర్శకాలకు లోబడి ఉన్నాయని, ఈ అప్పులు రాష్ట్ర బడ్జెట్ పరిధిలోకి రావని వాదించింది.

# ప్రజాగళం వినిపించడం డ్రామానా?

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ప్రియాంక గాంధీ ఆగ్రహం

### చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అని కౌంటర్


### ప్రధాని విమర్శలపై వ్యాఖ్యానించడానికి రాహుల్ నిరాకరణ



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ వెలుపల ప్రతిపక్షాలను ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. డ్రామాలు వద్దు అంటూ ప్రధాని చేసిన కామెంట్స్‌ను కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ తప్పుబట్టారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో లేవనెత్తడం డ్రామా ఎలా అవుతుందంటూ ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై చర్చ లేకపోతే పార్లమెంట్ ఎందుకని నిలదీశారు. ప్రజల సమస్యలపై చర్చలకు అనుమతించకపోవడమే డ్రామా అంటే అని కౌంటర్ ఇచ్చారు. పార్లమెంట్ వద్ద ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, ప్రధాని మోడీ వ్యాఖ్యలను తప్పుపడుతూ, ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించడమే పార్లమెంట్ పని అని దాన్ని నాటకం అనడం సరికాదని విమర్శించారు.
దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), వాయు కాలుష్యం దేశవ్యాప్తంగా ఉన్న చాలా పెద్ద సమస్యలు ఉన్నాయని ప్రియాంకా గాంధీ వివరించారు. ఈ సమావేశాల్లో ఈ సమస్యల గురించి చర్చిద్దామని పేర్కొన్నారు. ఇది డ్రామా కాదని ముఖ్యమైన అంశాలను లేవనెత్తి మాట్లాడటం నాటకం కాదని తేల్చి చెప్పారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై పార్లమెంటులో ప్రజాస్వామ్య బద్ధంగా చర్చించేందుకు అనుమతి ఇవ్వకపోవడమే నాటకమని ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. ఇక ప్రధాని మోడీ విమర్శలపై వ్యాఖ్యానించడానికి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు.

# పోటాపోటీ ఉచితాలు ఆర్థికవ్యవస్థకు ప్రమాదం

### ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** రాజకీయ పార్టీలు పోటాపోటీగా ప్రకటిస్తున్న ఉచిత పథకాల సంస్కృతిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత హామీలు ఎన్నికల్లో గెలిపించవచ్చేమో గానీ, దేశాన్ని మాత్రం నిర్మించలేవని ఆయన స్పష్టం చేశారు. ఒక అంగ్లపత్రికలో రాసిన వ్యాసంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు 'రేవ్‌డీ కల్చర్' (ఉచితాల సంస్కృతి)ని తీవ్రంగా విమర్శించిన ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఇప్పుడు ఎన్నికల లాభాల కోసం అవే హామీలు ఇస్తున్నారని సుబ్బారావు ఎద్దేవా చేశారు. ఇది ఏదో ఒక పార్టీ వైఫల్యం కాదని, మొత్తం రాజకీయ వ్యవస్థలోనే పాతుకుపోయిన సమస్య అని ఆయన అభిప్రాయపడ్డారు. హామీలు నమ్మశక్యంగా లేనప్పుడు ప్రజలు వాటిని విశ్వసించడం మానేస్తారని పేర్కొన్నారు. ప్రతి ఉచిత పథకం ఒక రాజకీయ వైఫల్యానికి అంగీకారమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించలేకపోతున్నాం, అందుకే ఈ తాయిలాలతో సర్దుకుపోవాలని నేతలు చెప్పడమే దీని అర్థమని వివరించారు. దేశంలో ఉద్యోగాల కల్పన, ఉత్పాదకత పెంపు వంటి కీలక అంశాలపై చర్చ జరగడం లేదని, వాటి స్థానంలో నగదు బదిలీ హామీలపై చర్చ జరుగుతోందని విశ్లేషించారు. ఈ ఉచితాల కోసం ప్రభుత్వాలు అప్పులు తీసుకురావడం మరింత ఆందోళన కలిగించే విషయమని, ఇది భవిష్యత్ తరాల పన్ను చెల్లింపుదారులపై భారం మోపడమేనని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల ఆర్థిక దుస్సాహసాలను అడ్డుకోవాల్సిన ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడుతున్నాయని అన్నారు. పేదలకు వ్యతిరేకులుగా ముద్ర పడుతుందన్న భయంతో ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను విమర్శించే సాహసం చేయలేకపోతోందని పేర్కొన్నారు.

# అవినీతి కేసుల్లో క్షమాభిక్ష ప్రసాదించండి

### వారానికి మూడుసార్లు కోర్టుకు వెళ్లాల్సివస్తోంది

### ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌కు ప్రధాని నెతన్యాహు లేఖ




**టెల్‌అవీవ్, డిసెంబరు 1:** పలు అవినీతి కేసుల్లో ఐదేళ్లుగా అభియోగాలను, కోర్టు విచారణను ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తనకు క్షమాభిక్ష ప్రసాదించాలని దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారికంగా లేఖ రాశారు. ప్రధాని కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు అధ్యక్ష కార్యాలయం దీనిని అసాధారణ అభ్యర్థనగా పేర్కొంది. ఇది అనేక చిక్కులతో ముడిపడి ఉందని తెలిపింది. తనపై సుదీర్ఘంగా సాగుతున్న విచారణను ముగించాలని అందులో నెతన్యాహు కోరారు. తనపై విచారణ దేశాన్ని విభజిస్తోందని ఓ వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. వారానికి మూడుసార్లు తాను న్యాయస్థానానికి హాజరుకావాల్సి వస్తోందని, దీని వల్ల దేశానికి నాయకత్వం వహించడం కష్టమవుతోందని తెలిపారు. 'నాపై విచారణ విషయంలో దేశం ముక్కలుగా విడిపోయింది. క్షమాభిక్ష ప్రసాదిస్తే దేశ ఐక్యత పునరుద్ధరణకు తోడ్పడుతాను. ఇజ్రాయెల్ చరిత్రలో హాజరైన ఏకైక ప్రధానమంత్రిగా నిలిచారు. సంపన్న రాజకీయ మద్దతుదారులకు ఆయన అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నెతన్యాహుకు క్షమాభిక్ష ప్రసాదించాలని హెర్జోగ్‌ను కోరారు. క్షమాబిక్ష కావాలనుకునేవారు తనకు అధికారికంగా లేఖ పంపాల్సి ఉంటుందని ఆ సమయంలో హెర్జోగ్ స్పష్టం చేశారు. మోసం, నమ్మకద్రోహం, అవినీతి తదితర అభియోగాలతో మూడు కేసుల్లో నెతన్యాహు విచారణ ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణకు ద్విదేశ పరిష్కారమే మార్గమని పోప్ లియో-14 తెలిపారు. రెండుపక్షాలకు ఈ పరిష్కారమే న్యాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

# ఉజ్జయిని సామూహిక వివాహాల్లో పెళ్లిచేసుకున్న సిఎం కుమారుడు



**ఉజ్జయిని, డిసెంబరు 1:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన కుమారుడి వివాహాన్ని అత్యంత నిరాడంబరంగా, సామాజిక బాధ్యతతో జరిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఉజ్జయినిలో జరిగిన ఒక సామూహిక వివాహ వేడుకలో మరో 21 జంటలతో పాటు తన చిన్న కుమారుడు అభిమన్యు యాదవ్ వివాహాన్ని ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అభిమన్యు డాక్టర్ ఇషిత మెడలో మూడు ముళ్లు వేశారు. సుమారు 25,000 మంది అతిథులు హాజరైన ఈ వేడుకను భారీ ఎత్తున ఏర్పాటు చేసినా, ఆడంబర ప్రదర్శనకు బదులుగా సామాజిక సమానత్వానికి పెద్దపీట వేశారు. వేర్వేరు సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన 22 జంటలు ఒకే వేదికపై ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా సీఎం మోహన్ యాదవ్ మాట్లాడుతూ "మా కుమారుడు అభిమన్యు, కోడలు ఇషితతో పాటు మరో 21 జంటలు ఈ పవిత్ర వేడుకలో ఒక్కటయ్యాయి. సనాతన సంస్కృతి, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని తెలిపారు. యోగా గురు రాందేవ్ బాబా ఈ జంటలన్నింటికీ వేదమంత్రాల సాక్షిగా వివాహ క్రతువును జరిపించారు. ఇలాంటి గొప్ప ఆదర్శాన్ని ప్రదర్శించిన తొలి ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అని ఆయన ప్రశంసించారు. ఈ చర్య దేశంలోని సంపన్న కుటుంబాలకు స్ఫూర్తినిస్తుందని, పెళ్లిళ్ల పేరిట జరిగే అనవసరపు ఖర్చులకు అడ్డుకట్ట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, దుర్గాదాస్ ఉయికే, అసెంబ్లీ స్పీకర్ నరేంద్ర సింగ్ తోమర్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



# కరవడానికి మనుషులు పార్లమెంట్‌లోనే ఉన్నారు..

### కుక్కపిల్లతో వచ్చిన రేణుక కామెంట్స్ వైరల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి పార్లమెంట్ సమావేశాలకు ఒక కుక్కపిల్లతో రావడం తీవ్ర చర్చనీయాంశం అయింది. కరవడానికి మనుషులు పార్లమెంట్ లోపలే ఉన్నారు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు రేణుకా చౌదరి ఈ ఉదయం పార్లమెంట్‌కు వచ్చారు. ఆమె వెంట కారులో ఒక కుక్కపిల్ల ఉండటంతో అందరూ ఆశ్చర్యపోయారు. అయితే, దానిని వెంటనే తన కారులోనే ఇంటికి పంపించేశారు. ఈ విషయంపై మీడియా ప్రశ్నించగా, తాను పార్లమెంట్ కు వస్తుండగా దారిలో ప్రమాదానికి గురయ్యేలా ఉన్న ఆ కుక్కపిల్లను చూసి కాపాడానని తెలిపారు. ఒక జీవి ప్రాణాన్ని కాపాడితే తప్పేంటని, పార్లమెంట్‌కు కుక్కపిల్లను తీసుకురావొద్దని ఏదైనా చట్టం ఉందా అని ఆమె ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆమె ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, కరవడానికి మనుషులు పార్లమెంట్ లోపలే ఉన్నారు, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. దానితో ఎలాంటి సమస్య లేదా నేను ఒక జంతువును కాపాడితే అది పెద్ద చర్చ అవుతుందా అని వ్యాఖ్యానించారు. రేణుకా చౌదరి వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇది పార్లమెంట్‌ను, ఎంపీలను అవమానించడమేనని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. రేణుక తన సహచర ఎంపీలందరినీ కుక్కలతో పోల్చారని, కాంగ్రెస్ పార్టీ చర్చలు కాకుండా డ్రామాలు కోరుకుంటోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగ సంస్థలపై గౌరవం లేదని, రేణుకా చౌదరి దేశానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# గగనతలంలోనే లక్ష్యాన్ని ఛేదించిన 'కిజెలెల్మా'

### తుర్కియే అమ్ములపొదిలో అధునాతన అస్త్రం



**అంకారా, డిసెంబరు 1:** ప్రపంచ వైమానిక రంగంలో తుర్కియే సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆ దేశానికి చెందిన మానవరహిత యుద్ధ విమానం 'కిజెలెల్మా' తొలిసారిగా గగనతలంలోని ఒక జెట్ టార్గెట్‌ను గాలి నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణితో అత్యంత కచ్చితంగా ఛేదించింది. ఈ అరుదైన ఘనత సాధించిన ప్రపంచంలోనే మొట్టమొదటి మానవరహిత యుద్ధ విమానంగా కిజెలెల్మా రికార్డులకెక్కింది. నవంబర్ 30న సినోప్ ఫైరింగ్ ఏరియాలో ఈ కీలక పరీక్షను నిర్వహించారు. ఈ ప్రయోగంలో భాగంగా, కిజెలెల్మా యుద్ధ విమానం ఐదు ఎఫ్ 15 ఫైటర్ జెట్‌లతో కలిసి ప్రయాణించింది. రాడార్ నుంచి అందిన సమాచారంతో, తన రెక్క కింద అమర్చిన గోక్‌డోగన్ క్షిపణిని ప్రయోగించి, టార్గెట్ డ్రోన్‌ను విజయవంతంగా నాశనం చేసింది. ఈ ఆపరేషన్‌లో అసెల్సాన్ సంస్థకు చెందిన మురాద్ ఏసా రాడార్ కీలక పాత్ర పోషించింది. ఈ చారిత్రక విజయంపై టర్కీకి చెందిన ప్రముఖ ప్రైవేట్ రక్షణ రంగ సంస్థ, కిజెలెల్మా తయారీదారు అయిన బేకర్ హర్షం వ్యక్తం చేసింది. సంస్థ చైర్మన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అయిన సెల్యుక్ బేరక్తార్ మాట్లాడుతూ వైమానిక చరిత్రలో మేం ఒక కొత్త శకానికి నాంది పలికాం. ప్రపంచంలో తొలిసారిగా ఒక మానవరహిత యుద్ధవిమానం రాడార్ గైడెన్స్‌తో క్షిపణిని ప్రయోగించి, గగనతల లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని తెలిపారు. బేకర్ సంస్థ తన ప్రతిష్ఠాత్మక మియస్ ప్రాజెక్టులో భాగంగా కిజెలెల్మాను అభివృద్ధి చేసింది. బేరక్తార్ టీబీ2 డ్రోన్లతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సంస్థ, ఇప్పుడు కిజెలెల్మాతో మరో ముందడుగు వేసింది. శత్రు రాడార్లకు సులభంగా చిక్కని స్టెల్త్ టెక్నాలజీ, అత్యాధునిక సెన్సార్లు, విమాన వాహక నౌకల నుంచి టేకాఫ్ అయ్యేసామర్థ్యం దీని ప్రత్యేక తలు. భవిష్యత్తులో సూపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించే కిజెలెల్మాబి, కిజెలెల్మాసి వేరియంట్లను కూడా తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# పార్లమెంటు సమావేశాలు కుదించడంపై విపక్షాలు సీరియస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కుదించడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. సాధారణంగా ఈ సమావేశాలు 20రోజులు జరుగుతాయి. అయితే, ఈసారి 15 రోజుల పాటు మాత్రమే జరగనున్నాయి. నేటి నుంచి ఈ నెల 19 వరకు సమావేశాలు జరగనుండగా, ఇందులో నాలుగు రోజులు సెలవులు ఉన్నాయి. శీతాకాల సమావేశాలను కుదించడంపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శలు చేశారు. పార్లమెంట్ సమావేశాలను సజావుగా జరిపే ఉద్దేశం అధికార పక్షానికి ఉన్నట్లు కనిపించడం లేదని ప్రియాంక చతుర్వేది అన్నారు. అహంకారంతో ప్రతిచోట అధికారం నిలుపుకుంటామనే భావన వారిలో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. పార్లమెంటరీ విధానాలను అనుసరించాల్సిన అవసరం లేదని వారి అభిప్రాయంగా కనిపిస్తోందన్నారు. కేవలం 15రోజులలో 13 బిల్లులు తీసుకురావాలని చూస్తున్నారని, అంటే వీటిపై సరైన చర్చ జరగాలని వారు కోరుకోవడం లేదని అన్నారు. నిరసనల మధ్య ఈ బిల్లులను ఆమోదించాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుత్ కూడా శీతాకాల సమావేశాలను కుదించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పక్షం పార్లమెంటులో చర్చను అణచివేయాలని చూస్తోందని విమర్శించారు.

# సంక్షిప్తంగా..

## బెంగళూరు ట్రాఫిక్‌పై సమాజ్‌వాది ఎంపి సీరియస్



**బెంగళూరు, డిసెంబరు 1:** కర్ణాటక రాజధాని బెంగళూరు నగర రహదారులు, ట్రాఫిక్ జామ్‌లపై సమాజ్‌వాది పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పోలీసులను యూజ్ లెస్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నగర ట్రాఫిక్ సమస్యపై సామాజిక మాధ్యమ వేదికగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకువెళ్లారు. బెంగళూరు నగర ట్రాఫిక్ అత్యంత దారుణంగా ఉందని, ఇక్కడి పోలీసులు నిష్ప్రయోజకులని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనడానికి ఆది వారం తాను ఢిల్లీ బయలుదేరగా, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు తెలిపారు. వాహనాల రద్దీని క్లియర్ చేయడానికి రహదారిపై ఒక్క పోలీసు కూడా కనిపించలేదని విమర్శించారు. విమా నాశ్రయానికి సమయానికి చేరుకోవాలనే ఉద్దేశంతో బెంగళూరు పోలీసులను తాను సంప్రదించానని, కానీ వారు స్పందించలేదని ఆరోపించారు.

## భూకేటాయింపుల కేసుల్లో బంగ్లా మాజీ ప్రధానికి ఐదేళ్లు జైలు

**ఢాకా, డిసెంబరు 1:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు మరో అవినీతి కేసులో ఎదురుదెబ్బ తగిలింది. పూర్బాచల్ న్యూ టౌన్ ప్రాజెక్టులో భూముల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఢాకాలోని ప్రత్యేక కోర్టు ఆమెకు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. సోమవారం ఈ సంచలన తీర్పును వెలువ రించింది. ఇదే కేసులో హసీనా సోదరి షేక్ రెహానాకు ఏడేళ్లు, ఆమె మేనకోడలు, బ్రిటిష్ ఎంపీ తులిప్ సిద్ధిఖీకి రెండేళ్ల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఢాకా స్పెషల్ జడ్జి కోర్టు4 న్యాయమూర్తి ఎండీ రబియుల్ ఆలం ఈ తీర్పును ప్రకటించారు. నిందితులు ముగ్గురూ కోర్టుకు హాజరు కాలేదు. కేసులో మరో 14మంది నిందితులకు కూడా తలా ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దోషులైన 17 మందికి లక్ష బంగ్లాదేశ్ టాకాల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

## అతిపెద్ద నాటకాల రాయుడు మోడీయే: ఖర్గే, జైరామ్ ధ్వజం



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం వాడి వేడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీరుపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచు కుపడ్డారు. దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చ జరపకుండా, ప్రధాని మరోసారి నాటకానికి తెరలేపారని ఆయన ఘాటుగా విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని చేసిన ప్రసంగాన్ని ఉద్దేశించి ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. గడచిన 11 ఏళ్లుగా కేంద్రప్రభుత్వం పార్లమెంటరీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిరంతరం కాలరాస్తోంది. ఇందుకు సంబంధించిన ఘటనల జాబితా చాలాపెద్దదని ఖర్గే ఆరోపించారు. గత వర్షాకాల సమావే శాల్లోనే దాదాపు 12బిల్లులను హడావుడిగా ఆమోదించారని ఆయన గుర్తు చేశారు. కొన్ని బిల్లులను 15 నిమిషాలకన్నా తక్కువసమయంలో,మరికొన్నింటిని అసలు చర్చలేకుండానే పాస్ చేశారని విమర్శించారు.

## హైకమాండ్‌తో శశిథరూర్‌కు పెరిగిన అంతరం..



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్‌కు, పార్టీ హైకమాండ్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. పార్టీ నిర్వహించిన రెండు కీలక సమావేశాలకు ఆయన వరుసగా గైర్హాజరు కావడంతో, ఆయన కాంగ్రెస్‌ను వీడతారనే ఊహాగానాలు తీవ్రమయ్యాయి. వచ్చే ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సోనియా గాంధీ నివాసంలో నిన్న సాయంత్రం జరిగిన ఉన్నతస్థాయి సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా ముఖ్య నేతలందరూ ఈ భేటీలో పాల్గొన్నారు. తాను కేరళలో వృద్ధాప్యంలో ఉన్న తల్లితో ఉన్నందున సమావేశానికి రాలేకపోయానని థరూర్ మీడియాకు తెలిపారు. అయితే, నవంబర్ 18న జరిగిన మరో కీలక సమావేశానికి కూడా ఆయన అనారోగ్యం కారణంగా హాజరుకాలేదు.

# డిజిటల్ అరెస్టు కేసుల్లో కృత్రిమమేధ ఎందుకు వినియోగించడం లేదు!

## ఆర్‌బిఐకి సుప్రీం ధర్మాసనం సూటి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** సైబర్ నేరాల నియంత్రణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)ను ఎందుకు వినియోగించడంలేదని సుప్రీంకోర్టు బెంచ్ రిజర్వు బ్యాంకును ప్రశ్నించింది. డిజిటల్ అరెస్టు కేసుల విచారణపై దాఖలయిన పిటిషన్ విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలుచేసింది. ఈ కేసుల్లో దేశవ్యాప్తంగా ఒకే తరహా దర్యాప్తు ఉండాలని కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐకి సూచించింది. సిబిఐ విచారణకు సమ్మతి తెలియజేయాలని బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సూచనలుచేసింది. దేశంలో గడచిన కొంతకాలంగా డిజిటల్‌అరెస్టులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులం అంటూనేరగాళ్లు, ఆడియో, వీడియోకాల్స్‌చేసి బాధితులను భయపెట్టి డిజిటల్ అరెస్టు అంటూ బెదిరించి కోట్లరూపాయలు కొల్లగొడుతున్నారు. డిజిటల్ అరెస్టుకారణంగా తాను కోటిరూపాయలు నష్టపోయాయని హర్యానాకు చెందిన ఒక వృద్ధమహిళ వేసిన పిటిషన్ విచారణ క్రమంలో సుప్రీం సీరియస్ వ్యాఖ్యలుచేసింది. సైబర్‌నేరాలకేసుల్లో నేరస్తులు ఉపయోగించే బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసేందుకు కృత్రిమమేధ లేదా మెషిన్‌లెర్నింగ్ టెక్నాలజీని ఎందుకు వినియోగించడం లేదో తెలియజేయాలని ఆర్బీఐకి సుప్రీం బెంచ్ నోటీసులు జారీచేసింది.

# మహిళాలోకానికి ఆదర్శం ఈశ్వరీబాయి

## 107వ జయంతి వేడుకల్లో స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్

## మంత్రి సీతక్కకు ఈశ్వరీబాయి పురస్కారం ప్రదానం




ఈశ్వరీబాయి పురస్కారంతో మంత్రి సీతక్కను సత్కరిస్తున్న ప్రసాద్‌కుమార్, గీతారెడ్డి, వివేక్, నిర్మల, విజయారెడ్డి, అలేఖ్యపుంజాల తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 1, ప్రభాతవార్త :** యావత్ మహిళాలోకానికి ఆదర్శం జె.ఈశ్వరీబాయి సంఘసంస్కర్త అని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజాసేవలో ఒక కార్పొరేటర్‌గా, తర్వాత ఎమ్మెల్యేగా, పార్టీ అధ్యక్షురాలిగా సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారని తెలిపారు. దేశంలో అట్టడుగువర్గాల కోసం పోరాటిన అంబేద్కర్‌ని స్ఫూర్తి అలుపెరగని నాయకురాలు ఈశ్వరీబాయి దళితబంధు అభివేత, దాడులు జరిగితే స్వయంగా రంగంలోదిగి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆమె పోరాటంతోనే బాలికలకు ఉచితవిద్యం, సమాన గౌరవం ఉండాలని పోరాడిన సంఘసంస్కర్త అని కొనియాడారు. వీర ధైర్య వంతురాలైన ఈశ్వరీ బాయి నమ్మిన సిద్ధాంతాల నుండి వివాదాల ప్రలోభాలకు లొంగక కడదాకా మాటమీద నిలబడిన నాయకురాలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శవంతురాలన్నారు. ఈరోజు ఒక ఉద్వేగమైన క్షణం, ఎంతో భావోద్వేగాన్ని, బాధ్యతను ఈ పురస్కారం తనను ముందుకు నడిపిస్తుందని, ఈశ్వరమ్మ ఆశయాలు, స్ఫూర్తి కీర్తిని ఈతరం ముందుకుతీసుకువెళ్లాలని పురస్కార స్వీకర్త మంత్రి సీతక్క తన స్పందనలో పంచుకున్నారు. ఈశ్వరీబాయి జీవితం ప్రతీఒక్కరికి స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రిఅమిత్‌షా అంబేద్కర్‌ను కాదు దేవుడిని నమ్మమని చెప్పారు. ఎవరి నమ్మకం వారిది, ఆయా దేవుళ్లను నమ్ముకోమని ఎవరూ బలవంతంగా ఎవ్వరినీ ఒప్పించలేరు. అది రాజ్యాంగాన్నిస్ఫూర్తికి విరుద్ధమ న్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ మాజీ మంత్రి, ఈశ్వరీబాయి కుమార్తె డా. జె.గీతారెడ్డి సభాధ్యక్షతన ఈశ్వరీబాయి 107వ జయంతి వేడుకలు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఈశ్వరీబాయి పురస్కార స్వీకర్త మంత్రి దనసరి అనుసూయ సీతక్క, విశిష్ట అతిథులు మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే ఎన్.గణేష్, ఆచార్య అలేఖ్య పుంజాల, పి. విజయారెడ్డి, టి.నిర్మల జగ్గారెడ్డి, జె.బి.రాజు, ప్రొఫెసర్ లింగస్వామి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి, ఈశ్వరీబాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు.

# మహిళా వ్యాపారవేత్త వలువలు తీసి బెదరించిన బిజినెస్‌మ్యాన్

**ముంబయి, డిసెంబరు 1:** దేశంలోని ప్రధాన నగరాల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళల నుంచి సాధారణ యువతుల వరకు వేధింపులు, అఘాయిత్యాలకు గురవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ముంబై, కోల్‌కతా నగరాల్లో వెలుగు చూసిన రెండు వేర్వేరు దారుణ ఘటనలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఒకచోట ప్రముఖ ఫార్మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఓ మహిళా వ్యాపారవేత్తను చంపేస్తానని బెదరించి, నగ్నంగా మార్చి వీడియోలు తీయగా, మరోచోట క్యాబ్ కోసం ఎదురుచూస్తున్న యువతిని పరిచయస్తులే కారులోకి లాగి అత్యాచారానికి పాల్పడ్డారు. ముంబైకి చెందిన 51 ఏళ్ల మహిళా వ్యాపారవేత్తపై ఫ్రాంకోఇండియన్ ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపక సభ్యుడు జాయ్ జాన్ పాస్కల్ పోస్ట్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలు ముంబై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఓ సమావేశం పేరుతో పాస్కల్ తనను ఫార్మా కంపెనీ కార్యాలయానికి పిలిపించారు. అక్కడికి వెళ్ళాక, ప్రాణాలు తీస్తానని బెదరించి దుస్తులు విప్పాలని బలవంతం చేశారు. ఆమె నిస్సహాయ స్థితిలో ఉండగా, నిందితుడు అసభ్య పదజాలంతో దూషిస్తూ తన నగ్న ఫోటోలు, వీడియోలు చిత్రీకరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు జాయ్ జాన్ పాస్కల్ పోస్ట్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

# 9లోపుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## ప్రజాపాలన సంబురాల్లో భాగస్వామ్యం కల్పించాలి

## తెలంగాణ ఎంప్లాయీస్ జెఏసి స్టీరింగ్ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ఈ నెల 9లోపుగా రాష్ట్రంలోని ఉద్యోగులకి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ(టిజిఈజేఏసీ) డిమాండ్



చేసింది. ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్న ప్రజా పాలన సంబురాల్లో ఉద్యోగులకు భాగస్వామ్యం కల్పించాలని జేఏసీ కోరింది. సోమవారం టిఎన్‌జీవో సెంట్రల్ ఆఫీస్‌లో జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం జేఏసీ అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకి తెలిపారు. ప్రభుత్వము ప్రతి ఆరు నెలలకొకసారి డీఏ విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన 64 హామీల మేరకు విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు నెం.78 జూన్ 13వ తేదిన విడుదల చేసిన ఉత్తర్వులను అనుసరించి మంజూరై పెండింగ్‌లో ఉన్న డీఏను ప్రజాపాలన సంబురాలకు ముందుగా విడుదల చేసి తమను సైతం సంబురాలలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులపై మంత్రివర్గ ఉపసమితి ఇప్పటికే నిర్ణయం తీసుకుందని.. దానిని వెంటనే అమలు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పలు మార్లు తమతో జరిపిన సమావేశాలలో చెబుతున్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. దీని మూలంగా ఉద్యోగులు, పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈహెచ్‌ఎస్ స్కీమ్‌వెంటనే అమలు చేసి,ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 2010 సంవత్సరం కంటే ముందుగా నియామకమైన ప్రభుత్వ ఉపాధ్యాయులందరికి టెట్ అర్హత పరీక్ష తప్పనిసరిగా పాస్ కావాలన్న నిబంధన నుండి మినహాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు.

# మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా 20 మంది ట్రాన్స్‌జెండర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** హైదరాబాద్ మెట్రో రైల్ సామాజిక సమ్మిళితత్వం దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలో సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో 20 మంది ట్రాన్స్‌జెండర్లను భద్రతా సిబ్బందిగా నియమించింది. ప్రత్యేక శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వీరంతా సోమవారం నుంచి ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లు, రైళ్లలో తమ విధులను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ సమ్మిళిత విధానాలు, అణగారిన వర్గాల సాధికారతకు అనుగుణంగా ఈ నియామకాలు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రో యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కొత్తగా విధుల్లో చేరిన ఈ సిబ్బంది మెట్రో స్టేషన్లలోని సాధారణ ప్రాంతాలతో పాటు, ప్రత్యేకంగా మహిళల కోసం కేటాయించిన కోచ్‌లలో భద్రతను పర్యవేక్షిస్తారు. ప్రయాణికులకు సమాచారం అందించడం, దిశానిర్దేశం చేయడం, బ్యాగేజ్ స్కానర్ల వద్ద పర్యవేక్షణ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు.

# తెలంగాణలో కోటి మంది మహిళలు కోటీశ్వరులు

## పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లు, అద్దె బస్సులు

## సెర్ప్, మెప్మాను ఒకే గొడుగు కిందికి తెచ్చిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** తెలంగాణ మహిళలు ప్రపంచ పారిశ్రామిక వేత్తలతో పోటీ పడాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో వివిధ పథకాలు.. అభ్యుదయ విధానాలను అమలు చేసింది. రెండేళ్లలోనే మహిళల సాధికారిత దిశగా దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలబడింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేపట్టిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మీ పేరుతో మహిళలందరికీ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించింది. రెండేండ్లుగా ఈ ఉచిత ప్రయాణ సదుపాయం మహిళల ఆదరణను చూరగొంది. రోజూ లక్షలాది మంది తెలంగాణ ఆడబిడ్డలు చదువుల కోసం, పనుల మీద బస్సులో ఉచితంగా జీరో టికెట్‌పై ప్రయాణం చేస్తున్నారు. ఛార్జీలపై ఆదా చేసుకున్న సొమ్మును ఇతర ఖర్చులకు సర్దుబాటు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలు రూ.7600 కోట్లు ఆదా చేసుకున్నారు. రోజుకు దాదాపు 30 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్లపై ప్రయాణిస్తున్నారు.

రెండో ప్రాధాన్యతగా ఇంటి ఆడబిడ్డలకు ఖర్చు తగ్గించే ఉద్దేశంతో సబ్సిడీపై ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలెండర్‌ను ప్రజా ప్రభుత్వం అందిస్తోంది. దాదాపు 45 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి.

ఇందిరా మహిళాశక్తి స్కీమ్ ద్వారా స్వయంకృషితో ఎదిగే మహిళలకు రుణాలు అందించటం ద్వారా స్వయం సహాయక గ్రూపులు ఆర్థికంగా తమకాళ్ల మీద తామే నిలబడేలా సర్కారు సహకారం అందిస్తోంది. ఇందిరా జీవిత బీమా పథకం, ఇందిరా రుణ బీమా పథకం శిల్పారామం వద్ద ద్వాక్రా మహిళా బజార్ ఏర్పాటు ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు. మహిళల భద్రత కోసం టి- సేఫ్ లాంటి సౌకర్యాలను ఈ రెండేళ్లలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు నమ్ముకున్న ప్రభుత్వం తెచ్చింది. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి మిషన్ 2025 పాలసీని అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు ఇందిరా మహిళా శక్తి సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధ్వర్యంలో, పట్టణాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో ఉన్నాయి. వేర్వేరు సంస్థల పరిధిలో ఉండటంతో ఉమ్మడి పథకాల అమలుకు ఇబ్బందులున్నాయని ప్రభుత్వం గుర్తించింది.

గ్రామాల్లోని సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారు పట్టణాలకు వలస వచ్చినప్పుడు వారికి పథకాలు అందడం లేదు. మరోవైపు చాలా గ్రామాలు పక్కన ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమయ్యాయి. ఇప్పటికే సెర్ప్ పరిధిలోని 33,914 సంఘాలు మెప్మా పరిధిలోకి వెళ్లాయి. అందుకే మెప్మా వేరు.. సెర్ప్ వేరుగా కాకుండా.. సంఘాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేలా ప్రజా ప్రభుత్వం కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. కోటి మంది మహిళలు రూ.లక్ష కోట్ల రుణాన్ని పొందినప్పుడు నిజమైన మహిళా సాధికారత సిద్ధిస్తుందని సంకల్పించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.26 వేల కోట్ల రుణాలను పంపిణీ చేసింది. కొత్తగా 2,25,110 సంఘాలు రూ.4825.54 కోట్ల వ్యాపారాలను ప్రారంభించాయి.

రాష్ట్రంలో22 జిల్లాల్లో జిల్లా సమాఖ్యలకు ఇందిరా మహిళాశక్తి భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. సెక్రటేరియట్‌తో పాటు జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆఫీసులు, కోర్టులు, కాలేజీలు, హాస్పిటళ్లు, ఆలయాలు, టూరిస్టు ప్రాంతాలు న్యాయస్థానాలు, కళాశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యశాఖ ద్వారా 32 జిల్లాల్లో మొబైల్ ఫిష్ అవుట్ లెట్లను ప్రారంభించింది. రూ.10 లక్షల విలువైన వాహనాలను 60 శాతం సబ్సిడీతో అందజేసింది.

ప్రమాదానికి గురైన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చెందిన కుటుంబాలకు రూ.10లక్షల ప్రమాద బీమాను అందించింది. కొన్ని కుటుంబాలకు రూ.2 లక్షల రుణబీమాను చెల్లించింది. దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 32 జిల్లాలలో 64 మెగా మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. మహిళా సమాఖ్యల వద్ద ఉన్న రూ.54 కోట్లతో 600 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరా గాంధీ జయంతి నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కోటి చీరలు మొదటి దశలో 65 లక్షల గ్రామీణ మహిళలకు పంపిణి చేయాలని, రెండో దశలో మార్చిలో పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఇప్పటి వరకూ 3.66 లక్షల టన్నుల పత్తి కొనుగోలు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఇప్పటి వరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మొత్తం 3.66 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పత్తి కొనుగోలు విలువ 2,904 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ నోటిఫై చేసిన 330 జిన్నింగ్ మిల్లుల్లో ఈ నెల 1 నుంచి పత్తి కొనుగోళ్లు చురుగ్గా కొనసాగుతున్నాయని చెప్పారు. సీసీఐ కొత్త నిబంధనల కారణంగా అనుమతులు లభించకపోవడంతో జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ గతంలో సమ్మెకు దిగిందని, దీనివల్ల రైతులు పత్తిని అమ్ముకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. దీన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి కొనుగోళ్లకు ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో బాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 330 మిల్లుల్లో కొనుగోళ్లకు అనుమతులు లభించాయని వెల్లడించారు.

# డ్రామాలు వద్దు

## ●ప్రభుత్వ విధానాలపై చర్చ జరగాలి● విపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలి●పార్లమెంట్ వెలుపల ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** 'పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సభలో డ్రామాలు వద్దని, దేశానికి అవసరమైన వాటిపైనే దృష్టిపెటాలి. విపక్షాలు బీహార్‌లో ఓటమి బాధ నుంచి బయటపడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడుతూ... నినాదాలు చేయడానికి బయట చాలా వేదికలు ఉన్నాయని, పార్లమెంటును మాత్రం విధాన రూపకల్పనకు పరిమితం చేయాలని సూచించారు. ఉభయ సభలలో ఫలవంతమైన చర్చలు జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశాలు కేవలం ఒక సంప్రదాయం కాదని, దేశాన్ని శరవేగంతో ప్రగతి పథంలో నడిపించే ప్రయత్నాలకు కొత్త శక్తినిచ్చే మార్గమని ప్రధాని అన్నారు. "భారతదేశం ప్రజాస్వామ్య స్ఫూర్తితో జీవిస్తోంది. ఇటీవలి బీహార్ ఎన్నికల్లో భారీగా పోలైన ఓటింగ్, ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని బలపరిచింది. ప్రజాస్వామ్యం ద్వారా ఫలితాలు సాధించగలమని భారత్ నిరూపించింది. ప్రపంచం మన ప్రజాస్వామ్య, ఆర్థిక వ్యవస్థల బలాన్ని నిశితంగా గమనిస్తోంది' అని ఆయన వివరించారు.

# సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కాలపై కొత్తగా 'ఆరోగ్య భద్రత సెస్'

## పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కాలాంటి ఉత్పత్తులపై అమలులో ఉన్న పన్ను విధానం సమీక్షించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో రెండు కీలక బిల్లులు ప్రవేశపెడుతున్నారు. మొదటి బిల్లు హెల్త్‌సెక్యూరిటీ అండ్ నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025, రెండవ బిల్లు సెంట్రల్ ఎక్సైజ్ చట్టసవరణ బిల్లులు పెడుతున్నారు. ఈ రెండుబిల్లులుప్రస్తుతం అమలులో ఉన్న జిఎస్‌టి పరిహారసెస్‌ను తొలగించి కొత్త పేరుతోకానీ అదే నిర్మాణంతో పన్నుల వసూళ్లను కొనసాగించాలని నిర్ణయించారు. తాజా సమాచారం ప్రకారం ఈ కొత్తసెస్‌కు 'ఆరోగ్యభద్రత' అన్న పేరును ఖరారుచేసారని సమాచారం. సిగరెట్లు, పాన్‌మసాలా గుట్కా ఉత్పత్తులు



జిఎస్టీతోపాటు పరిహారం సెస్సుకింద పన్నులు విధిస్తున్నారు. ఇక ఈ సెస్సు త్వరలోనే ముగుస్తుంది దీనితోప్రభుత్వం రాబడుల నష్టం భర్తీకోసం అదే సెస్సును కొత్తచట్టం పేరుతో కొనసాగిస్తోంది. పన్నురేట్లు మారడంలేదని అయితే సామాన్య ప్రజలకు ధరల పెరుగుదల ప్రస్తుతం కనిపించదని నిపుణులు చెపుతున్నారు. కంపెనీలకు మాత్రం రిపోర్టింగ్ విధానాలు, అకౌంటింగ్ ప్రక్రియలు పన్ను కంప్లయన్స్‌లలో మార్పులు వస్తాయి. సిగరెట్ తయారీ రంగం ఇప్పటికే అధికపన్ను భారం మోస్తోంది కొత్త చట్టం అమలుకువస్తే మరింత కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ తప్పనిసరి అవుతుంది. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను జిఎస్టీపరిధినుంచి తొలగించి సెంట్రల్ ఎక్సైజ్‌పరిదిలోకి తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. అక్రమరవాణాను నియంత్రించడం పన్నుసేకరణను మరింత క్రమబద్ధీకరించేందుకు ఈకొత్త చట్టం వీలుకల్పిస్తుందని అందకే పన్ను చట్టం పేరుమార్చి మాత్రమే తీసుకువస్తున్నట్లు కేంద్రం చెపుతోంది.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకండి

## పారిశ్రామికవేత్తలకు మంత్రి అజారుద్దీన్ పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతలో భాగంగా, డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. ఈ సదస్సుకు పరిశ్రమల అధినేతలు హాజరుకావాలని ఆయన కోరారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీటీ గోల్ఫ్ హైదరాబాద్ 2025-26 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ.. బీటీ గోల్ఫ్ ఈవెంట్ ప్రతిభ, స్నేహభావం, వ్యాపార సంబంధాలను పెంపొందించడానికి ఒక అద్భుతమైన వేదిక అని ప్రశంసించారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని అజారుద్దీన్ వివరించారు. ఈ సదస్సు రాష్ట్ర అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కెటిఆర్‌కు మరో ఆహ్వానం

## నేడు చెన్నైలో ఇగ్నిషన్ సదస్సులో ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ఆహ్వానం అందింది. శివ్‌నాడార్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక సదస్సు ఇగ్నిషన్‌లో పాల్గొని ప్రసంగించాలని ఆహ్వానించారు. నేడు (డిసెంబరు 2) సాయంత్రం 6.30 గంటలకు జర్నలిస్ట్ శోమా చౌదరి నిర్వహణలో చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో ఈ సదస్సు జరగనుంది. దేశంలోని ప్రముఖ నాయకులు, ఆర్థికవేత్తలు, విధాన రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో రీబూటింగ్ ది రిపబ్లిక్ అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించనున్నారు.

# మహిళా సంఘాలకు మరో గుడ్‌న్యూస్

## 448 అద్దె బస్సుల కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 1:** రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 152 మహిళా సమాఖ్యలు ఆర్టీసీకి తమ బస్సులను అద్దెకు ఇచ్చాయి. మరో 448 మహిళా సంఘాల నుంచి బస్సులను అద్దెకు తీసుకునే ప్రక్రియ చివరి దశలో ఉందని ఆయన స్పష్టం చేశారు.

# మానసిక వికాసానికి క్రీడలు అత్యవసరం

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** మానసిక వికాసానికి, శారీర ధృడత్వానికి క్రీడలు అత్యవసరమని పిల్లలను ఆన్‌లైన్ గేముల్లో కాదు, మైదనాల్లో ఆడుకొనేలా ప్రొత్సాహం ప్రేరణ ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించిన టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి అభివృద్ధి చెందేందుకు ఇలాంటి క్రీడోత్సవాలు ఎంతో సహాయపడతాయని పేర్కొన్నారు. మానసిక ధృడత్వానికి మానసిక వికాసంకు గెలుపోటములు ఉపకరిస్తాయని క్రీడాస్ఫూర్తితో ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కొనే ధైర్యం వస్తుందని ఆయన అన్నారు. క్రమశిక్షణ, టీమ్‌వర్క్, పోటీతత్వం వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.

# డిజిపిల సదస్సులో టి.సేఫ్ విశిష్టతను వివరించిన శివధర్‌రెడ్డి

## ప్రధాని మోడీ నుంచి ప్రశంసలు

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి డిజిపిలు, నిఘా విభాగం ఐజిల సదస్సులో తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి మహిళల భద్రతకు సంబంధించి రాష్ట్ర పోలీసు శాఖ చేబట్టిన టీ...సేఫ్ వ్యవస్థ విశిష్టతను వివరించి ప్రధాని నరేంద్ర ఎ ప్రశంసలతో పాటు సభికుల మన్ననలను అందుకున్నారు. రాయ్‌పూర్‌లో గత వారం నాడు మూడు రోజుల పాటు దేశ అంతర్గత భద్రతతో పాటు నక్సలైట్ల అంశం సహా పలు విషయాలపై డిజిపిలు, ఐజిపిల జాతీయ స్థాయి సదస్సు జరగడం తెలిసిందే. ఈ సదస్సుకు మొదటి రోజు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా రాగా చివరి రోజున ప్రధాని మోది హాజరయ్యారు. చివరి రోజున తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి మహిళల భద్రతకు సంబంధించి రాష్ట్రం తీసుకున్న చర్యలను వివరించారు. ఇందులో భాగంగా 2024లో ప్రారంభించిన టీ..సేఫ్ వ్యవస్థకు



జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిన విషయాన్ని ఆయన వివరించారు.

కేంద్రం నుంచి కూడా అవార్డు అందిన అంశాన్ని ఆయన ప్రస్తావించారు. టీ...సేఫ్ విశిష్టతను సమావేశంలో వివరించారు. మహిళల సురక్షిత ప్రయాణం కోసం టీ...సేఫ్ ఎలా ఉపయోగపడుతుందనే దాని గురించి ఆయన సభికులకు వివరించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2022 ప్రకారం దేశంలో అత్యధికంగా శ్రామిక మహిళల శాతం తెలంగాణలోనే వుందని, ఈ నేపథ్యంలో తెలంగాణలో మహిళల ప్రయాణం మరింత సురక్షితంగా వుండేందుకు టీ...సేఫ్ వ్యవస్థను తీసుకు వచ్చి, దానిని పక్కాగా అమలు చేస్తున్నామని డిజిపి వివరించారు. 2024లో దీనిని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

టీ...సేఫ్ కేవలం ఆపదలో ఆదుకునేది మాత్రమే కాదని, మహిళలు ప్రయాణం మొదలుపెట్టిన సమయం నుంచి పూర్తయ్యే వరకు వుంటుందని ఆయన తెలిపారు. ట్రావెల్ సేఫ్ లేదా టీ...సేఫ్‌గా పిలిచే దీనిని స్మార్ట్ ఫోన్ అవసరం కూడా లేదని, అన్ని ఫోన్లలో దీనిని వాడే వీలుంటుందని ఆయన తెలిపారు. మహిళల నుంచి దీనిని ఐదుకు గానూ 4.7 రేటింగ్ లభించిందని డిజిపి తెలిపారు. దీని కోసం 350కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో రాష్ట్రంలోని ఊబర్, ఓలా సహా అన్ని క్యాబ్ సర్వీసుల్లోకి దీనిని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. 2027 నాటికి పోలీసు శాఖలో మహిళల నిష్పత్తిని 50 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు, దీంతో పాటు పోలీసు శాఖలో మహిళలు మరింత మంది పనిచేసేలా పరిస్థితులు కల్పించాలని భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకోసం ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్యాంశాలల్లో లింగ నిష్పత్తి విషయమై మార్పులు చేశామని, మహిళల భద్రతకు సంబంధించిన పాఠ్యాంశాలు చేర్చామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోది డిజిపి శివధర్ రెడ్డి ప్రజెంటేషన్‌ను ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా చేబట్టడం ద్వారా మహిళలకు మరింత భద్రత కల్పించవచ్చని మోది అభిప్రాయపడ్డారు.

# ప్రపంచం గుర్తించేలా విద్యావిజన్ ఉండాలి

## టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ప్రపంచం గుర్తించేలా విద్యా విజన్ ఉండాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ విద్యా విధానం ఉన్నతిని పెంచేలా విజన్ డాక్యుమెంట్ ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో మార్పులు వస్తున్నాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోందని ఈ దిశగా తెలంగాణ విద్యావిధానంలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి అవకాశాల్లో వెనుకబాటుకు నైపుణ్యం కొరతే కారణమని, ప్రపంచ విద్యా సంస్థలను రాష్ట్ర విద్యా వ్యవస్థకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అపారమైన మానవ వనరులు న్నాయని, విస్తృతమైన మౌలిక సదుపాయాలకు కేంద్రమన్న వాస్తవాన్ని ఇతర దేశాలు గుర్తించేందుకు గ్లోబల్ సమ్మిట్‌ను వేదికగా చేసుకోవాలన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో విద్యా విధానం భవిష్యత్ ఎలా ఉండాలనే అంశంపై అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు ప్రభుత్వం తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ బౌలింగ్ కింగ్స్

## అత్యధిక వికెట్లు తీసిన టాప్ 5 బౌలర్లు

**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో బౌలర్ల పాత్ర మరింత ముఖ్యమైంది. సుదీర్ఘ స్పెల్‌లు, మ్యాచ్ గమనాన్ని మార్చే బంతులు, కష్టమైన పరిస్థితుల్లో వికెట్లు తీయగల సామర్థం, వీటితో కొందరు బౌలర్లు డబ్ల్యూటీసీ చరిత్రలోనే తమదైన ముద్ర వేశారు. ప్రస్తుతం డబ్ల్యూటీసీలో అత్యధిక వికెట్లు తీసిన టాప్5 జాబితాలో ముగ్గురు ఆస్ట్రేలియా, ఇద్దరు భారతీయ బౌలర్లు ఉన్నారు. డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక వికెట్లు (219) తీసిన బౌలర్‌గా ఆస్ట్రేలియా ఆఫ్‌స్పిన్నర్ నాథన్ లయన్ అగ్రస్థానంలో ఉన్నాడు. 2019 నుంచి అతను ఈ ఫీట్‌ను సాధించాడు. లయన్ బౌలింగ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అతని లైన్ లెంగ్త్, బ్యాట్స్‌మెన్‌లను తప్పు చేయడానికి ఉసిగొల్పే సామర్థ్యం. అతని బెస్ట్ స్పెల్ 8/64. అతను 13 సార్లు నాలుగు వికెట్లు, 10 సార్లు ఐదు వికెట్లు తీశాడు. అలాగే ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 215 వికెట్లతో లయన్‌కు చాలా దగ్గరగా ఉన్నాడు. అతని పేస్, స్వింగ్, బౌన్స్ ద్వారా కమిన్స్ డబ్ల్యూటిసిలో అనేక మ్యాచ్‌లు గెలిపించాడు. అతని అద్భుతమైన సగటు 22.13, బెస్ట్ స్పెల్ 6/28తో అతను ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన బౌలర్‌లలో ఒకడిగా నిలిచాడు. లెఫ్ట్ హ్యాండ్ పేసర్ మిచెల్ స్టార్క్ తన ఇన్‌స్వింగ్ యార్కర్లతో, యాంగిల్‌తో బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెడతాడు. స్టార్క్ ఇప్పటివరకు 201 వికెట్లు తీశాడు. అతని స్ట్రైక్ రేట్ (43.33) చూస్తే, అతను పాత బంతితో, కొత్త బంతితో కూడా క్రమం తప్పకుండా వికెట్లు తీయగల ప్రమాదకరమైన బౌలర్ అని అర్థమవుతుంది. ఇక టీమిండియా గ్రేట్ స్పిన్నర్ ఆర్. అశ్విన్ డబ్ల్యూటీసీలో 195 వికెట్లు తీశాడు. అతని బెస్ట్ బౌలింగ్ ఫిగర్ 7/71. అత్యంత తక్కువ బౌలింగ్ సగటు 21.49 కలిగి ఉన్న బౌలర్‌లలో అతను ఒకడు. స్పిన్, ఫ్లైట్, వేగంలో మార్పుల ద్వారా అశ్విన్ ఎల్లప్పుడూ బ్యాట్స్‌మెన్‌లకు పెద్ద సవాలు విసురుతాడు. మరో భారత్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు 184 వికెట్లు తీసి టాప్5లో నిలిచాడు. అతని సగటు 18.90, స్ట్రైక్ రేట్ 40.53తో అతను ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఫాస్ట్ బౌలర్లలో ఒకడు అని నిరూపించాడు. బుమ్రా ప్రత్యేకమైన బౌలింగ్ యాక్షన్, రివర్స్ స్వింగ్‌తో ప్రపంచంలోని ప్రతి బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడతాడు.



### ప్రపంచ కప్‌లో..
## జపాన్ గెలుపు
### 4-8 తేడాతో భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్‌లో జపాన్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం ఉత్సాహభరితమైన ప్రదర్శనను అందించింది కానీ ఆదివారం జరిగిన రెండవ పూల్‌స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ చేతిలో 4-8 తేడాతో చిత్తుగా పరాజయం చెందింది. మానికా బాత్రా-మానవ్ ఠక్కర్ టాప్ 10 ప్రపంచ ప్రత్యర్థులపై విజయాలు నమోదు చేశారు. మివా హరిమోటో-షున్సుకే టోగామి చేతిలో మిక్స్‌డ్ డబుల్స్ ఓపెనర్ యశస్విని ఘోర్పడే-ఆకాష్ పాల్ 0-3 తేడాతో ఓడిపోవడంతో జపాన్ ఆరంభంలో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ వరుస గేమ్‌ల ఓటమితో భారత్ తీవ్ర ఒత్తిడిలోకి ఎదుర్కొంది. ఆ తర్వాత మానికా బాత్రా తన కెరీర్‌లో అత్యుత్తమ ఫలితాల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచ 8వ ర్యాంక్‌లో ఉన్న మిమా ఇటోను 2-1 (9-11, 11-8, 11-8)తో ఓడించింది. ఈ విజయం జపాన్ స్టార్‌పై ఆమె తొలి విజయాన్ని నమోదు చేసి మొత్తం టైను 1-1తో సమం చేసింది. ప్రపంచ 8వ ర్యాంకర్ సోరా మత్సుషిమాపై జరిగిన పురుషుల సింగిల్స్ రబ్బర్‌లో మానవ్ ఠక్కర్ అద్భుతమైన ప్రదర్శనతో భారత్‌కు రెండో విజయాన్ని అందించాడు. ఠక్కర్ 2-1 (11-9, 11-4, 6-11)తో విజయం సాధించి, టైలో భారత్‌ను తొలిసారిగా ఆధిక్యంలో నిలిపాడు. అయితే, మహిళల డబుల్స్ ద్వారా జపాన్ తిరిగి నియంత్రణ సాధించింది. హినా హయాటా మరియు మిమా ఇటోల జోడీ 3-0తో దియా చిటాలే మరియు యశస్విని ఘోర్పడేలను ఓడించి జపాన్ ఆధిక్యాన్ని పునరుద్ధరించింది. జపాన్ మిగిలిన రబ్బర్లను సమర్థవంతంగా ఓడించి 8-4 ఫలితాన్ని సాధించింది.



### సుల్తాన్ అజ్లాన్ షా కప్..
## భారత్ ఓటమి
### 0-1 తేడాతో బెల్జియం గెలుపు

**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్-2025, బెల్జియం చేతిలో 0-1 తేడాతో భారత్ ఓడిపోయింది. దీంతో భారత్ జట్టు రజత పతకంతో సరిపెట్టుకుంది. మలేషియాలోని ఇపోలో జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్లో భారత్‌ను చిత్తు చేసిన బెల్జియం సుల్తాన్ అజ్లాన్ షా కప్‌ను గెలుచుకుంది. 34వ నిమిషంలో థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ చేసిన ఏకైక గోల్ కారణంగా భారత్ రజత పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. అంతకు ముందు కెనడాపై 14-3 తేడాతో భారీ విజయం సాధించిన తర్వాత ఈ మ్యాచ్‌లోకి అడుగుపెట్టిన భారత్, తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మార్చలేకపోయింది. ఈ టోర్నమెంట్‌లో జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్ విజయం సాధించినప్పటికీ, వారు బెల్జియన్ రక్షణను ఓడించలేకపోయారు. ఈ టోర్నమెంట్‌లో భారత్ ఎదుర్కొన్న ఏకైక ఓటమి లీగ్ దశలో బెల్జియం చేతిలోనే జరిగింది. ప్రాథమిక దశలో బెల్జియం భారత్‌పై 3-2 తేడాతో విజయం సాధించింది. రెండు జట్ల మధ్య తీవ్రమైన మిడ్‌ఫీల్డ్ పోరాటాలు జరిగాయి. మొదటి అర్ధభాగం గోల్ లేకుండా ముగిసింది, కానీ రెండు జట్లు వ్యూహాత్మక ఆటను ప్రదర్శించాయి. బెల్జియం ప్రారంభంలో రెండు పిసిలు సంపాదించినప్పటికీ, భారతదేశం వారిని దూరంగా ఉంచడంలో బాగానే చేసింది. మ్యాచ్‌లో స్థిరపడటానికి భారతదేశం కొంత సమయం పట్టింది, ఆట అర్ధభాగంలో 0-0తో సమంగా ఉండటంతో, బెల్జియం తన జోరును మార్చుకుని భారత్‌పై ఒత్తిడి పెంచింది. భారత జట్టు మూడవ క్వార్టర్‌లో కూడా బెల్జియన్ డిఫెన్స్‌ను అధిగమించలేకపోయింది. 34వ నిమిషంలో స్టాక్‌బ్రోక్స్ గోల్ చేయడంతో భారతదేశం స్కోరును సమం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించింది. కానీ బెల్జియం విజయాన్ని ముగించడంలో విజయవంతమైంది.

## ట్రయాంగిల్ సిరీస్‌లో.. సంయుక్త విజేతగా భారత్, అఫ్ఘానిస్థాన్

**న్యూఢిల్లీ:** అండర్ 19 ట్రైయాంగిల్ వన్డే టోర్నమెంట్‌లో భారత్, అఫ్గనిస్తాన్ జట్టు సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దిత్వా తుపాను ప్రభావంతో బెంగుళూరులో భారీ వర్షం కురియడంతో మ్యాచ్‌ను 31 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 79 పరుగులు చేసిన దశలో వెలుతురు లేమి, వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ తర్వాత ఎంత సేపు ఎదురు చూసినా వర్షం తగ్గుముఖం పట్టకపోవడం, ఆట తిరిగి ప్రారంభించే పరిస్థితులు లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. తదుపరి రెండు జట్లు సంయుక్త ఛాంపియన్లుగా ప్రకటించారు. ఇక భారత్ బ్యాటర్లలో కనిష్క్ చౌహాన్ (28 నాటౌట్), అభిజ్ఞ కుందు (27) ఫర్వాలేదనిపించగా, కెప్టెన్ విహాన్ మల్హోత్రా (10), వన్ష్ అచార్య (2), వఫి (2), వినీత్ (0) విఫమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో అబ్దుల్ అజీజ్ 2 వికెట్లు పడగొట్టాడు.

ఆట



### ఆసియా కప్ క్వాలిఫయర్స్..
## భారత్‌కు ఫైనల్ బెర్త్ కన్ఫమ్
### ఇరాన్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి పురుషుల అండర్ 17 ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో ఇరాన్‌పై విజయంతో భారత్ ఆసియా కప్ ఫైనల్స్‌కు చేరుకుంది. అహ్మదాబాద్‌లో జరిగిన క్వాలిఫయర్స్‌లో ఇరాన్‌పై 2-1 తేడాతో విజయం సాధించి భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు తమ స్థానాన్ని బుక్ చేసుకుంది. ఏడు పాయింట్లతో ఇరాన్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా అడుగుపెట్టి అజేయంగా నిలిచింది. అయితే జట్టు ముందుకు సాగడానికి ఒక డ్రా మాత్రమే అవసరం ఉంది. నాలుగు పాయింట్లతో ఉన్న భారత్‌కు విజయం తప్ప మరో అవకాశం లేదు. మొదట 45+1 నిమిషంలో ఫార్వర్డ్ ఆటగాడు డల్లాల్మున్ గాంగ్టే పెనాల్టీని గోల్‌గా మార్చడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత 52వ నిమిషంలో గున్లీబా వాంగ్ఖైరక్పామ్ విజేతను గోల్‌గా మార్చింది. మొదట 10వ నిమిషంలో కెప్టెన్ మహాన్ బెహెష్టి చేసిన లాంగ్ రేంజ్ ప్రయత్నాన్ని తప్పించారు. ఆట ముగిసే సమయానికి, ఎడమ వైపు నుండి వచ్చిన ఒక కార్నర్ ఇరానియన్ బాక్స్ లోపల గందరగోళానికి దారితీసింది. డిఫెండర్ అమీర్మహాన్ అఫ్రోజియాని లూపింగ్ బంతిని క్లియర్ చేయడంలో విఫలమయ్యాడు. భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. దీంతో ఇరాన్ ముందుకు దూసుకెళ్లి 64వ నిమిషంలో బెహెష్టి చేసిన ప్రమాదకరమైన ఫ్రీకిక్ సర్కార్ నుండి మరో విన్యాసపూరిత సేవ్ చేయడంతో భారత్ గెలుపు అనివార్యమైంది.

## రూ.10 తగ్గిన వాణిజ్య సిలిండర్‌ధర!

**న్యూఢిల్లీ,డిసెంబరు 1:** వినియోగదారులకు ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు గుడ్ న్యూస్ చెప్పాయి. దేశ వ్యాప్తంగా మెట్రో నగరాల్లో ఎల్పీజీ వాణిజ్య సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ .10 తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అమల్లోకి వస్తా యి.ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా గానే తాజాగా సవరించిన ధరలు వెల్లడించాయితాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల



కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,580గా ఉంది. గతంలో ఇది రూ.1,590గా ఉండేది. కోల్‌కతాలో రూ.1,694 నుంచి రూ.1,684కు తగ్గింది.ఇక ముంబైలో రూ.1,542గా ఉన్న ధర రూ.1,531.50కి దిగొచ్చింది. హైదరాబాద్‌లో కమర్షియల్ ఎల్‌పీజీ ధర రూ.1,746 నుంచి రూ. 1,736కు తగ్గింది. మరోవైపు, గృహ వినియోగం కోసం ఉపయోగించే 14. 2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులేదు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వంట గ్యాస్ ధర రూ.850 నుంచి రూ.960 మధ్య ఉంది.

## మందగించిన పారిశ్రామిక ఉత్పత్తిసూచీ వృద్ధి

**న్యూఢిల్లీ, డిసెంబరు1:** భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీ అక్టోబరులో మందగించింది. 0.4శాతంమాత్రమే పెరిగింది. కేంద్ర అర్థగణాంకశాఖ విడుదలచేసిన వివరాలనుపరిశీలిస్తే పండుగ దినాలు, దసరా, దీపావళి, ఛాత్ పండుగల కారణంగా ఉత్పత్తి మందగించినట్లు తేలింది. సెప్టెంబరులో ఉన్న 4శాతం వృద్ధినుంచి వెనుకబడింది. 2024 అక్టోబరులో అయితే 3.5శాతం వృద్ధినమోదుచేస్తే ఆస్థాయికి కూడా గత అక్టోబరు నమోదుకాలేదు. మౌలిక వనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులు 7.1శాతంగా పెరిగాయి. క్యాపిటల్ గూడ్స్ అంటే భారీ యంత్రసామగ్రి విభాగం



2.4శాతం, అంతర్ వస్తూత్పత్తి తయారీ రంగం 0.9శాతం పెరిగింది. ప్రాథమిక ఉత్పత్తులు 0.6శాతం తగ్గాయి. వినియోగరంగ ఉత్పత్తులు 0 .5శాతం, ఇతర నాన్ డ్యూరబుల్ ఉత్పత్తులు 4.4శాతం క్షీణించాయి. ఉత్పత్తిరంగంలో మెటల్స్, ఆటోమొబైల్స్ కొంత మద్దతిచ్చాయి. ఉత్పత్తిరంగం పరంగా మొత్తం 1.8శాం వృద్ధిని నమోదుచేసింది. ప్రాథమిక మెటల్స్ 6.6శాతం, కోక్, రిఫైండ్ పెట్రోలియం ఉత్పత్తులు 6.2శాతం, మోటారు వాహణాలు,ట్రైలర్లు, సెమీ ట్రైలర్లు 5.8శాతం ఉత్పత్తి నమోదుచేసింది. ఆటోమొబైల్‌పరంగా ఆటో విడిభాగాలు, ప్యాసింజర్‌కార్లు వాణిజ్యవాహనాల్లో వృద్ధినమోదయింది.

వాణిజ్యం




## జిఎస్టీ వసూళ్లు స్వల్పవృద్ధి మాత్రమే!

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** జిఎస్టీ వసూళ్లు నవంబరులోస్వల్పంగా0.7శాతంమాత్రమే పెరిగాయి. రూ.1,70, 276 కోట్లు వసూలయ్యాయి. గతనెలలో 1.52 లక్షలకోట్లు వసూళ్లు జరిగినట్లు కేంద్రం డేటా విడుదలచేసింది.అదే గత ఏడాది నవంబరులో 1,69,016కోట్లు వసూళ్లు జరిగాయి. ఇక నికరంగా చూస్తే జిఎస్టీ వసూళ్లు నవంబరులో ఈ ఏడాది 1,52,079 కోట్లు రాబట్టినట్లు కేంద్రం వెల్లడించింది. గతఏడాది ఇదేనెలలో రాబట్టిన నికరవసూళ్లతోపోలిస్తే 1.3శాతం పెరిగాయి. స్థూల దేశీయ రాబడులు రూ.1,24,300 కోట్లుగా ఉన్నాయి. దేశీ రాబడుల్లో 2.3శాతంగా క్షీణించింది. 2024 నవంబరులో రూ.1,27,281 కోట్లు వసూళ్లు జరిగాయి. దేశీయరాబడులు రూ.34, 843 కోట్లుసిజిఎస్‌టి, రూ.42,522 కోట్లు ఎస్జీఎస్టీ, రూ.46,934 కోట్లు ఐజిఎస్‌టి రాబడులున్నాయి. వీటికిభిన్నంగా దిగుమతులనుంచి వచ్చిన వసూళ్లు భారీ వ1ద్ధిని నమోదుచేసింది. స్థూల దిగుమతుల రాబడులు ఐజిఎస్టీ రూ.45,976 కోట్లుగా ఉనానయి. 10.2శాతం వృద్ధినమోదయింది. గత ఏడాది నవంబరులో 41,736 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇక రీఫండ్స్ కూడా గతనెలలో 4.0శాతం తగ్గాయి. రూ.18,196 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదేనెలలో 18,954 కోట్లుగా ఉన్న మొత్తం ఈసారి కట్టడి అయింది. నికర రాబడుల సంఖ్యాపరంగా దేశీయ రాబడి రూ.1,15,558 కోట్లుగా ఉన్నాయి. నికర ఎగుమతులు, దిగుమతుల రాబడులు రూ.36,521కోట్లుగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్రాల వారీగాచూస్తే ఎస్జీఎస్టీ ముందస్తు సెటిల్మెంట్లు ఒకటిశాతం తగ్గాయి. అనేక రాష్ట్రాలు ప్రతికూల వృద్ధిని నమోదుచేయడంతో క్షీణించినట్లు తేలింది. మిజోరమ్ అతితక్కువగా మైనస్ 41% ఆ తర్వాతసిక్కిమ్ మైనస్ 35శాతం, జమ్ముకాశ్మీర్; ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మైనస్ 15% చొప్పున ప్రతికూల వృద్ధినినమోదుచేసాయి. ఇక ఈశాన్యంలోని అరుణాచల్‌ప్రదేశ్‌లో 33శాతం, నాగాలాండ్‌లో 24శాతం, ఇతర ప్రాదేశిక ప్రాంతాల్లో 20శాతం చొప్పున వృద్ధిని నమోదుచేసినట్లు కేంద్రం వివరించింది.

### భారతీయుల వల్ల అమెరికాకు
## ఎంతో మేలు: ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, డిసెంబరు 1:** ప్రతిభావంతులైన భారతీయుల వల్ల అమెరికాకు ఎంతో మేలు జరిగిందని టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రశంసించారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన 'పీపుల్ బై డబ్ల్యూటీఎఫ్' పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో, కొన్ని కంపెనీలు హెచ్1బీ వీసా విధానాన్ని దుర్వినియోగం చేశాయని, అందుకే అమెరికాలో కొన్ని వలస వ్యతిరేక విధానాలు వచ్చాయని అభిప్రాయపడ్డారు. హెచ్1బీ వీసా ప్రోగ్రామ్‌పై మస్క్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. కొన్ని ఔట్‌సోర్సింగ్ కంపెనీలు హెచ్1బీ వీసా వ్యవస్థను తమకు అనుకూలంగా



మార్చుకున్నాయి (గేమ్డ్ ది సిస్టమ్). ఈ దుర్వినియోగాన్ని అరికట్టాలి. కానీ, అంతమాత్రాన హెచ్1బీ ప్రోగ్రామ్‌ను పూర్తిగా మూసివేయాలనే వాదన సరైంది కాదు. అలా చేస్తే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రతిభావంతుల కొరత ఎప్పుడూ ఉంటుందని మస్క్ అన్నారు. కొందరు అనుకున్నట్లు వలసదారుల వల్ల స్థానికులు ఉద్యోగాలు కోల్పోతున్నారనేది ఎంతవరకు నిజమో నాకు తెలియదు. మా కంపెనీలలో క్లిష్టమైన పనులను పూర్తి చేయడానికి తగినంత మంది ప్రతిభావంతులు దొరకడమే కష్టంగా ఉంది. అందుకే, మరింత మంది ప్రతిభావంతులు వస్తే మంచిదేనని తెలిపారు. తమ కంపెనీలలో ప్రపంచంలోని అత్యుత్తమ టాలెంట్ ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో, బైడెన్ ప్రభుత్వ వలస విధానాలను మస్క్ తప్పుబట్టారు. బైడెన్ హయాంలో సరిహద్దు నియంత్రణలు లేకపోవడంతో అక్రమ వలసలు భారీగా పెరిగాయి. సరిహద్దులు లేకపోతే అదొక దేశమే కాదని ఆయన విమర్శించారు. గతేడాది అమెరికా జారీ చేసిన హెచ్1బీ వీసాలలో 71 శాతం భారతీయులే పొందడం గమనార్హం.




## మార్కెట్లకు ఆర్‌బిఐ ఎంపిసి భయాలు
### రికార్డుస్థాయికి పెరిగి నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి, డిసెంబరు 1:** భారత రిజర్వ్‌బ్యాంకు మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరగనున్న నేపథ్యంలో వారం ప్రారంభంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దీనికి తోడు హెవీవెయిట్ షేర్లలో లాభాల స్వీకరణ జరగడంతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును చివరి వరకు కొనసాగించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద ముగిసింది. రెండో త్రైమాసికం జీడీపీ వృద్ధి మెరుగ్గా నమోదు కావడం, రూపాయి విలువ బలహీనపడటంతో డిసెంబర్‌లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో మార్కెట్లు ఒక రేంజ్‌కే పరిమితమయ్యాయని వారు పేర్కొన్నారు. దీనికి తోడు నవంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం కూడా సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అయితే, ఆటోమొబైల్ రంగం మాత్రం రాణించింది. నవంబర్‌లో బలమైన అమ్మకాలు, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ వంటివి ఈ రంగానికి కలిసొచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.25 శాతం పెరిగింది. మరోవైపు, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ రంగాలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.39 శాతం లాభపడింది. ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోయాయి. టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, కోటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఫ్లాట్‌గా ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.25 శాతం లాభంతో సెషన్‌ను ముగించింది.

### ఇకపై అన్ని ఫోన్లలో 'సంచార్‌సాథీ'
## యాప్ తప్పనిసరి

**న్యూఢిల్లీ, డిసెంబరు 1:** దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మొబైల్ ఫోన్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇకపై దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో సంచార్ సాథీ అనే ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయాలని మొబైల్ తయారీ కంపెనీలను ఆదేశించింది. ముఖ్యంగా, ఈ యాప్‌ను వినియోగదారులు తమ ఫోన్ల నుంచి తొలగించడం (డిలీట్ చేయడం) సాధ్యం కాదు. ఈ మేరకు కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సైబర్ మోసాలు, ఫోన్ చోరీలు, ఐఎంఈఐ నంబర్ల ట్యాంపరింగ్ వంటి సమస్యలను ఎదుర్కోవడానికి కేంద్రం ఈ ఏడాది జనవరిలో సంచార్ సాథీ పోర్టల్‌ను, యాప్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పోయిన లేదా దొంగిలించబడిన ఫోన్లను సులభంగా ట్రాక్ చేయవచ్చు. ఇప్పటివరకు ఈ యాప్ సహాయంతో సుమారు 7 లక్షల చోరీ ఫోన్‌లను గుర్తించి బ్లాక్ చేశారు. ఈ యాప్ సైబర్ దాడుల నుంచి వినియోగదారు




లను హెచ్చరించడంతో పాటు, అనధికారిక యాక్సెస్‌ను కూడా నిరోధిస్తుంది. కొత్త ఆదేశాల ప్రకారం, 2025 డిసెంబర్ 1 నుంచి తయారయ్యే అన్ని స్మార్ట్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను డిఫాల్ట్‌గా అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన ఫోన్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా దీన్ని ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. ఈ మార్పులను అమలు చేయడానికి మొబైల్ కంపెనీలకు 90 రోజుల సమయం ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయంపై యాపిల్, శాంసంగ్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా యాపిల్ వంటి సంస్థలు తమ ఆపరేటింగ్ సిస్టమ్‌లో థర్డ్‌పార్టీ యాప్‌లను డిఫాల్ట్‌గా చేర్చడానికి ఇష్టపడవు. గతంలో ఇలాంటి ప్రతిపాదనలను వ్యతిరేకించిన దాఖలాలు ఉన్నాయి. ఈ యాప్ ద్వారా సైబర్ నేరాలు 20 నుంచి 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.